PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 49 | విజయవాడ, సోమవారం 18 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 18 September 2023 | Rs

నేడు సెలవు

సోమవారం మా కార్యాలయానికి సెలవు, కావున మంగళవారం పత్రిక వెలువడదు, పునర్దర్శనం బుధవారం

- చీఫ్ జనరల్ మేనేజర్



ఆసియా విజేత భారత్

మియాభాయ్ మిన్నంటే ప్రదర్శన. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ (6/21) కొలంబోలో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ప్రేమదాస పిచ్‌పై కండ్లుచెదిరే స్వింగ్ రాబట్టిన సిరాజ్ ఒకే ఓవర్లో నాలుగు వికెట్లతో శ్రీలంక టాప్ ఆర్డర్‌ను కకావికలం చేయటంతో పాటు పది బంతుల వ్యవధిలో ఐదు వికెట్లు పడగొట్టి డిఫెండింగ్ చాంపియన్‌ను దిక్కుతోచని స్థితిలోకి తీసుకెళ్లాడు. హార్దిక్ పాండ్య (3/3), బుమ్రా (1/23) సైతం నిప్పులు చెరగగా.. శ్రీలంక 50 పరుగులకే కుప్పకూలింది. అతి స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన టీమ్ ఇండియా రికార్డు స్థాయిలో ఎనిమిదో సారి ఆసియా కప్ చాంపియన్స్‌గా నిలిచింది.

వివరాలు 6వ పేజీలో..

మహిళా బిల్లు ఆమోదించాలి



- అఖిలపక్షంలో ప్రతిపక్ష పార్టీలు
- నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

ఐదు రోజుల పాటు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఆదివారం నాడిక్కడ పార్లమెంట్‌లోని లైబ్రరీ భవన్‌లో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని మెజార్టీ రాజకీయ పార్టీలు బలంగా లేవనెత్తాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లును ప్రవేశపెట్టాలని, ఏకాభిప్రాయంతో ఆమోదం పొందేలా చూడాలని వివిధ పార్టీల నేతలు కోరారు. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలన్న పార్టీల డిమాండ్‌పై తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. కాశ్మీర్‌లో ప్రాణత్యాగం చేసిన భద్రతా దళాల సిబ్బందికి అఖిలపక్ష సమావేశంలో నివాళు లర్పించినట్టు మంత్రి తెలిపారు.సిపిఐ (ఎం) ఎంపి వి శివదాసన్ మాట్లాడుతూ 'కార్మికులు, రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలపై చర్చించాలి. ఎన్‌టిసి మిల్లు కార్మికులు జీతాలు లేకుండా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను విడిగా పరిగణించాలి. కొత్త పార్లమెంటు భవనంలో ఉపరాష్ట్రపతి జాతీయ జెండాను ఎగురవేసినట్టు ప్రకటన హిందీలో మాత్రమే అందుబాటులో ఉంది. భారతదేశ వైవిధ్యాన్ని పూర్తిగా తిరస్కరించే ఇలాంటి వైఖరిని సరిదిద్దాలి' అని డిమాండ్ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ.. హిందీ అంశాన్ని

మిగతా 5లో

'పల్లెకు పోదాం'

- నెలాఖరులో ప్రారంభించనున్న సిఎం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్టీ నేతలను ప్రజల్లోకి పంపడానికి వైసిపి సిద్ధమౌతోంది. దీనికోసం 'పల్లెకు పోదాం' పేరుతో ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. నెలాఖరులో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఆ పార్టీ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం ప్రతి మండలంలో పార్టీ మండలాధ్యక్షులు రోజుకో సచివాలయం పరిధిలో తిరిగి, రాత్రికి అక్కడే బసచేస్తారు. లబ్ధిదారులతో సహపంక్తి భోజనాలు కూడా ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తప్పని సరిగా ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారులను కలిసి జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం అందించినవేనని, రానున్న ఎన్నికల్లో మీ సహకారం కావాలని కోరాలని కూడా పార్టీ సూచించనుంది. రాత్రికి బస చేసే గ్రామంలో గ్రామ కమిటీల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేయడం , తటస్థులను పార్టీలో చేరే విధంగా నచ్చజెప్పే విధంగా కృషిచేయడం వంటి పనలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభమయ్యేనాటికి లబ్ధిదారుల జాబితాను తయారు చేయనున్నారు. ఒక్కో కుటుంబానికి ఎన్ని పథకాలు అందాయి? ఎంతమేర లబ్ధి చేకూరింది? అనే విషయాలను నమోదు చేసిన కౌంటర్ ఫైలును లబ్ధిదారులకు అందజేయనున్నారు. గ్రామ వాలంటీర్లు సేకరించిన వివరాలన్నింటినీ క్రోడీకరించి సంబంధిత గ్రామ వార్డు సచివాలయాల్లో " మా నమ్మకం నువ్వే జగనన్న" పేరుతో డిస్‌ప్లే బోర్డులను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఆయా బోర్డుల్లో ఒక వైపు ముఖ్యమంత్రి బొమ్మ ఉండనుండగా, మిగిలిన భాగంలో పథకం పేరు, లబ్ధిదారుల సంఖ్య, అందించిన లబ్ధి (డిబిటి ద్వారా నేరుగా నగదు రూపంలో) వివరాలను నమోదు చేయనున్నారు. అదే విధంగా నాన్ డిబిటి కింది అందించిన 8 పథకాల వివరాలను కూడా నమోదు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఉప్పందించింది కేంద్రమే!

- ఇడి, జిఎస్‌టి ఇంటెలిజెన్స్, ఇన్‌కంట్యాక్స్ దర్యాప్తులే కీలకం
- వాటి ఆధారంగానే స్కిల్ స్కాం ప్రైమాఫెసీ
- సిఐడి విచారణకు ఆదేశం
- కడకు చంద్రబాబు అరెస్టు

2

బిజెపిని గద్దెదించండి

- సిపిఎం పొలిట్‌బ్యూరో పిలుపు
- ఇండియా ఫోరమ్ బలోపేతం, విస్తరణకు నిర్ణయం

5



బిజెపి, బిఆర్‌ఎస్ మోసకారి పార్టీలు

- కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం
- ముగిసిన సిడబ్ల్యుసి సమావేశం
- భారీ బహిరంగ సభలో ఆరు వాగ్దానాలు చేసిన సోనియా



బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు..ఇన్‌సెట్‌లో అభివాదం చేస్తున్న ఖర్గే, సోనియా, రాహుల్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం పేర్కొంది. బిజెపి అవకాశవాద రాజకీయాలను ఎండగడుతూ కాంగ్రెస్ పాలసీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, క్షేత్రస్థాయి కార్యకర్తలు, నాయకులతో కలిసి పనిచేయాలని సిడబ్ల్యుసి దిశానిర్దేశం చేసింది. త్వరలో ఎన్నికలు జరిగే తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాం రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులపై రెండో రోజు సిడబ్ల్యుసి సమావేశంలో చర్చించారు. ఆ రాష్ట్రాల్లో ప్రజలు కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయా రాష్ట్రాల నాయకులు పార్టీ కార్యాచరణను వివరించారు. తెలంగాణకు సంబంధించి సిడబ్ల్యుసిలో ప్రధానంగా చర్చ జరిగింది. 'మోసకారి విధానాలతో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు తెలంగాణ సంపదను లూటీ చేశాయి. తెలంగాణ ప్రజల ఆకాంక్ష ఇప్పటికీ నెరవేరలేదు. తెలంగాణలో కుటుంబ పాలన కొనసాగుతోంది. నిజాం తరహా పాలనతో కెసిఆర్ ప్రభుత్వం ప్రజల హక్కులు హరిస్తోంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆ లక్ష్యం నెరవేరలేదు. వాతావరణ పరిస్థితులతోపాటు ప్రభుత్వాల లోపభూయిష్ట బీమా పాలసీతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పంపిణీ చేసిన భూములపై దళితులు, గిరిజనులు, బిసిలు హక్కులు కోల్పోయారు. బిజెపి విధానాలతో చిన్న వ్యాపారులు

మిగతా 2లో

ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోండి

- మంత్రి ధర్మానకు యుటిఎఫ్ డిమాండ్

లోపలి పేజీలో..

'నినాదాలకే పరిమితమైన బేటీ బచావో.. బేటీ పడావో'

- సనాతనం పేరుతో మహిళను వంటింటికే పరిమితం చేసే కుట్ర
- ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్

లోపలి పేజీలో..

స్థానిక ఉత్పత్తులనే కొనండి

'పిఎం విశ్వకర్మ' యోజన ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ



విశ్వ కర్మ యోజన ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : స్థానిక ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంప్రదాయ కళాకారులు, చేతివృత్తిదారుల కోసం రూ.13 వేల కోట్లతో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన (పథకం)ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రూ.5,400 కోట్ల అత్యాధునిక ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్ (ఐసిసిసి) - యశోభూమి మొదటి దశను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ జిఎస్‌టి నమోదయ్యే దుకాణాల్లో మేడ్ ఇన్ ఇండియా టూల్‌కిట్స్‌ను కొనుగోలు చేయాలని చేతివృత్తిదారులకు సూచించారు. గణేష్ చతుర్థి, ధంతేరస్, దీపావళి సహా రాబోయే అన్ని పండుగల సమయంలోనూ స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు 'యశోభూమి'ని ప్రతి కార్మికుడికి ('విశ్వకర్మ')కి అంకితం చేస్తున్నాను' అని అన్నారు. 1.8 లక్షల చదరపు మీటర్ల నిర్మాణంతో మొత్తం 8.9 లక్షల చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే 'యశోభూమి' పూర్తి పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందని, లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని మోడీ చెప్పారు. నూతన మెట్రో స్టేషన్ 'యశోభూమి ద్వారకా సెక్టార్ 25' ప్రారంభోత్సవంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో లైన్‌కు కూడా యశోభూమి అనుసంధానించబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వకర్మ టూల్‌కిట్ ఇ-బుక్‌లెట్‌తో పాటు, పథకం పరిధిలోకి వచ్చే 18 సంప్రదాయ వృత్తులకు చెందిన 18 కస్టమైజ్డ్ స్టాంప్ షీట్‌లను మోడీ ఆవిష్కరించారు. ఈ పథకం కింద 18 రకాల చేతివృత్తిదారులు, కళాకారులకు శిక్షణ, గుర్తింపు, సర్టిఫికెట్, వడ్డీ లేకుండా లక్ష రూపాయల, రెండు లక్షల రూపాయల రుణాలు అందిస్తారు. మార్కెటింగ్‌కు మద్దతు కల్పిస్తారు.

ఉప్పందించింది కేంద్రమే!

- ఇడి, జిఎస్‌టి ఇంటెలిజెన్స్, ఇన్‌కంట్యాక్స్ దర్యాప్తులే కీలకం
- వాటి ఆధారంగానే స్కిల్ స్కాం ప్రైమాఫేసీ
- సిఐడి విచారణకు ఆదేశం
- కడకు చంద్రబాబు అరెస్టు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

స్కిల్ డెవలప్‌మెంట్‌లో స్కాం జరిగిందా లేదా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారా లేదా అనే విషయాలపై వైసిపి ప్రభుత్వం, టిడిపిల బహిరంగ వాదనల్లో కేంద్ర ప్రభుత్వ పాత్ర మరుగున పడుతోంది. 'స్కిల్' కుంభకోణానికి ఉప్పందించింది కేంద్ర దర్యాప్తు సంస్థలని చంద్రబాబు అరెస్టు సందర్భంగా కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో సిఐడి స్పష్టం చేసింది. స్కాం జరిగిందన డానికి మూలం ఎప్పుడో 2018లో మహారాష్ట్రలో జిఎస్‌టి, ఆదాయపన్నుశాఖ (ఐటి), ఆ తర్వాతి కాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నిర్వహించి న విచారణలని సిఐడి పేర్కొంది. ఆ నివేదకలే సిఐడి దర్యాప్తునకు ప్రాథమిక ఆధారాలు. వాటిని బట్టే కేసు నమోదు చేసినట్లు విజయవాడ ఎసిబి కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో తెలిపింది.

పూణెలో మూలాలు

స్కిల్ ప్రాజెక్టులో కీలకంగా ఉన్న డిజైన్‌టెక్ పూణె బేస్డ్ సంస్థ. ఎటువంటి వ్యాపార కార్యకలాపాలూ లేని సింగపూర్‌లో రిజిస్టరైన డొల్ల కంపెనీల పేరిట రూపొందించిన నకిలీ ఇన్వాయిస్‌లతో వస్తువులు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లను కొనుగోలు చేయడంపై 2017-18లోనే పూణెకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) దర్యాప్తు చేపట్టింది. ఆ వెంటనే పూణె ఇన్‌కంట్యాక్స్ యూనిట్ విచారణ చేసింది. ఎపి ప్రభుత్వం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా డిజైన్‌టెక్‌కు విడుదలైన రూ.371 కోట్లలో కనీసం రూ.241 కోట్లు దుర్వినియోగం అయినట్లు ప్రాథమికంగా నిర్ధారించాయి. షెల్ కంపెనీలు బోగస్ ఇన్వాయిస్‌లు ఇవ్వడం వలన ఇది చోటుచేసుకుంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, కోర్స్‌వేర్, ఇతర వస్తువులు, సేవలు అందించకుండానే బ్యాంక్ ఖాతాలకు డబ్బు ట్రాన్స్‌ఫర్ అయింది. అక్కడి నుంచి హవాలా పద్ధతుల ద్వారా సొమ్ము బదిలీ చేశారని తొలుత కనుగొన్నది జిఎస్‌టి ఇంటెలిజెన్స్, ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంట్లే. ఇదంతా సరిగ్గా ఎన్‌డిఎ నుంచి, కేంద్ర ప్రభుత్వం నుంచి టిడిపి వైదొలిగిన, వైదొలుగుతున్న సమయంలోనే చోటుచేసుకోవడం గమనార్హం.

ఐటి నోటీస్‌తో కదలిక

ఈ సమాచారంతోనే వైసిపి సర్కారు వచ్చాక అప్పటి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజేయ కల్లం స్కిల్ స్కాంపై అంతర్గతంగా విచారణ జరిపించి, ప్రాథమిక సాక్ష్యాధారం ప్రైమాఫేసీ ఉందని, సిఐడి దర్యాప్తునకు 2021 సెప్టెంబర్ 7న లేఖ రాశారు. అదే ఏడాది డిసెంబర్ 7న సిఐడి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, వెనువెంటనే 13.12.2021న స్కిల్ కార్పొరేషన్‌కు డైరెక్టరుగా పనిచేసిన గంటా సుబ్బారావును తొలి నిందితునిగా అరెస్టు చేసింది. కాగా షెల్ కంపెనీలన్నీ సింగపూర్, ఇతర దేశాల బేస్డ్ కావడంతో మనీలాండ రింగ్ జరిగిందంటూ ఇడి 2022 మార్చి 20న ఇసిఐ ఆర్ నమోదు చేసి రంగంలోకి దిగింది. 4.3.2023న సీమెన్స్ ఇండియా మాజీ ఎమ్‌డి సౌమాద్రి శేఖర్ బోస్, డిజైన్‌టెక్ ఎమ్‌డి వికాస్ వినాయక్ ఖన్వెల్కర్, ముకుల్‌చంద్ర అగర్వాల్, సురేష్ గోయల్‌ను ఇడి అరెస్టు చేసింది. ఆ పూర్వరంగంలోనే 4.8.2023న హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ (24) ఇన్‌కంట్యాక్స్ అధికారి దొండపాటి వెంకట హరీష్ చంద్రబాబుకు నోటీస్ ఇచ్చారు. కేసులో 22వ నిందితునిగా ఉన్న యోగేష్ గుప్తా, మనోజ్ వాసుదేవ పరదేశి మధ్య ఆర్థిక లావాదేవీలు ఆ నోటీస్‌కు ఆధారం. ఏతావాతా చంద్రబాబు అరెస్ట్ వెనుక కేంద్ర దర్యాప్తు సంస్థలే కీలకంగా పని చేశాయని జనవాక్యం.

స్కిల్ స్కామ్‌లో నిధులు దారి మళ్లింపు : సిఐడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ.371 కోట్ల నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించిందని సిఐడి పునరుద్ఘాటించింది. సిఐడి చీఫ్ ఎన్ సంజయ్, అడిషనల్ ఎజిపి పి సుధాకర్‌రెడ్డి ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. నాటి ప్రభుత్వం షెల్ కంపెనీలకు నిధులు మళ్లించినట్లు తమ విచారణలో తేలిందన్నారు. నాటి ఒప్పందంతో తమకు సంబంధం లేదని సీమెన్స్ కంపెనీ పేర్కొందని, పక్కా ప్లానింగ్‌తోనే నిధులు మళ్లించారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సూత్రధారి చంద్రబాబేనని, ఆయన కనుసన్నల్లోనే స్కామ్ జరిగిందన్నారు. సెప్టెంబరు 5న చంద్రబాబు పిఎ పెండ్యాల శ్రీనివాస్‌కి నోటీసు ఇచ్చామని, అయితే 24 గంటల్లో ఆయన విదేశాలకు పారిపోయాడన్నారు. సీమెన్స్ ద్వారా మాత్రమే 2.13 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందారనడం సరికాదని, నాలుగైదు సంవత్సరాల నైపుణ్యాభివృద్ధి కృషి ఫలితమని చెప్పారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

జగన్ సామాజిక న్యాయసారథి

- రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక న్యాయ సారథిగా పేదల గుండెల్లో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చోటు దక్కించుకున్నాడని రాష్ట్ర మంత్రులు జోగి రమేష్, అంబటి రాంబాబు, ఆర్‌కె రోజా పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం మీడియాతో వారు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్‌కు షూటింగ్ గ్యాప్‌లో హడావుడిగా రావడం, ఒక ప్రెస్‌మీట్ పెట్టడం ఫ్యాషన్‌గా మారిందన్నారు. జైలులో ఉన్న చంద్రబాబుతో పొత్తు పెట్టుకుని ప్యాకేజీకోసం తన కార్యకర్తలను అభిమానులను ఆ సామాజిక వర్గం వారికి అమ్మేశాడని అన్నారు.. జగన్ రాజకీయాల్లోకి వచ్చి 13 ఏళ్లు అవుతోందని, రెండు సార్లు ఎంపి, రెండు సార్లు ఎమ్మెల్యే అయ్యారని, ఒక సారి ప్రతిపక్షనేత కాగా, నేడు ముఖ్యమంత్రిగా ఉన్నారన్నారు. పవన్‌కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి 15 ఏళ్లు అవుతోందని, కనీసం వార్డు మెంబరుగా కూడా కాలేదని అన్నారు.

జగన్‌కు మాఫియా అండ : పీతల సుజాత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధినేత జగన్ తాను ఒంటరివాడినని చెప్పుకోవడం ప్రజల్ని మోసం చేయడమే అని మాజీమంత్రి, టిడిపి నేత పీతల సుజాత అన్నారు. జగన్‌కు పక్క రాష్ట్రం నుంచి, రౌడీలు, మాఫియాల నుంచి మద్దతు, మీడియా బలం కూడా ఉందన్నారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు.

2004లో కేవలం రూ.1.73 కోట్ల ఆస్తి మాత్రమే కలిగి ఉన్న జగన్ నేడు రూ.లక్షల కోట్లకు అధిపతిగా ఎలా ఎగబాకరని ప్రశ్నించారు. త్వరలోనే జగన్ పీఠం కూలనుందని పేర్కొన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు నమోదు చేసి అన్యాయంగా అరెస్టు చేశారని, పైగా దుష్ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుపై నమోదు చేసిన అక్రమ కేసు జగన్ పతనానికి నాంది అని టిడిపి అధికార ప్రతినిధి నసీర్ అహ్మద్ మరో విలేకరుల సమావేశంలో అన్నారు.

సఫాయిలే నిజమైన అంబాసిడర్లు

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోడి కూతకన్నా ముందే లేచి తిరిగి అర్ధరాత్రి వరకు నిర్విరామ సేవలందిస్తున్న సఫాయిలే నిజమైన అంబాసిడర్లని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు అన్నారు. అదివారం విజయవాడ నగర పాలక సంస్థ, స్వచ్ఛాంధ్రకార్పోరేషన్ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గంలో స్వచ్ఛతా లీగ్ 2.0 ర్యాలీ నిర్వహించారు. అనంతరం యువతనుద్దేశించి ఆయన ప్రసంగించారు. పల్లె, పట్టణం తేడా లేకుండాఎక్కడ చెత్తా చెదారం ఉన్నా వెంటనే డంప్ యార్డులకు తరలిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజారోగ్యమే పరమావధిగా సఫాయి కార్మికులు పనిచేస్తున్నారని ఆయన కొనియాడారు. మురుగు కాల్వల శుభ్రతకు ఎంతో శ్రమించే సఫాయిలకు అడ్డంగా యంత్రాల సహాయంతో డ్రైనేజిలను శుభ్రం చేసి పద్ధతికి కార్పొరేషన్ శ్రీకారం చుట్టిదన్నారు. అక్టోబర్ 2 వరకు కొనసాగే స్వచ్ఛత సేవా కార్యక్రమంలో పాల్గొనే యువతకు గాంధీ జయంతి రోజున అవార్డులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్, దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ కోసం ఉద్యమిస్తాం

- ధర్నాలో సిపిఎస్ ఉద్యోగ సంఘాల నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేసే వరకు ఉద్యమిస్తామని సిపిఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. ఒపిఎస్ తప్ప ప్రభుత్వం ప్రతిపాదించిన గ్యారంటీ పెన్షన్ విధానం(జిపిఎస్)ను అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ఎపిసిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వై నాట్ ఒపిఎస్?' కార్యక్రమం విజయవాడలోని ధర్నాచౌక్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన నిరంకుశ వైఖరిని విడనాడలని కోరారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఒపిఎస్ తెస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఒపిఎస్ తప్ప మరే విధమైన ప్రత్యామ్నాయాలకు తాము తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శి కె రాజేశ్వరరావు మాట్లాడుతూ ఒపిఎస్ అడుగుతున్న ఉద్యోగులపై కేసులు నమోదు చేసి ప్రభుత్వం తన ప్రతాపాన్ని చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అసోసియేట్ అధ్యక్షులు సిఎం దాస్ మాట్లాడుతూ పాత పెన్షన్ అమలు చేసే వరకు తమ ఉద్యమాన్ని విరమించే ప్రసక్తే లేదని చెప్పారు. గౌరవ సలహాదారు కె పార్థసారథి మాట్లాడుతూ కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇవ్వకుండానే ఒపిఎస్‌ను పునరుద్ధరించి ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. ఒపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన సిఎం అమలు చేయకపోగా తమకు కేసులను బహుమానంగా ఇస్తున్నారని వాపోయారు. రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, జార్ఖండ్, కర్ణాటకలో లేని సాంకేతిక సమస్యలు రాష్ట్రంలోనే వచ్చాయా అని ప్రశ్నించారు. తమతో ప్రభుత్వం నేరుగా చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎంఎ.గఫూర్

కనీస వేతనాల అమలులో పాలకులు విఫలం

- ఎఐఆర్‌టిఎఫ్ రాష్ట్ర వర్క్‌షాప్ ముగింపులో ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ట్రాన్స్‌పోర్టు రంగంలో కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ అన్నారు. కర్నూలులోని పాతబస్తీ శ్రీలక్ష్మి నరసింహస్వామీ కళ్యాణ మండపంలో ఆల్ ఇండియా రోడ్‌ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల16, 17 తేదీల్లో రాష్ట్ర వర్క్‌షాప్ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు రాష్ట్ర అధ్యక్షులు శివాజీ అధ్యక్షతన జరిగింది. రెండవ రోజు ఆదివారం వర్క్‌షాప్ ముగింపులో ఎంఎ.గఫూర్, ఎఐఆర్‌టిఎఫ్ కార్యదర్శి ముజఫర్ అహమ్మద్, కోశాధికారి శ్రీనివాసులు, కమిటీ ముఖ్య నాయకులు దుర్గారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ రంగం అత్యంత ప్రాముఖ్యత కలిగిన రంగమని అన్నారు. అలాంటి రంగంలో కనీస వేతనాలు అమలు కావడంలేదని తెలిపారు. పని గంటలు సైతం పట్టించుకునే నాథుడే లేరన్నారు. ఆటో, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్లకు, ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు ఆర్థిక సహకారం అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. రవాణా రంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవాలని, ఈ చలానా విధానాన్ని రద్దు చేయాలని తదితర సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని కోరారు. ఈ వర్క్‌షాప్‌నకు ఆయా జిల్లాల నుంచి రవాణా రంగ ప్రతినిధులు హాజరయ్యారు.

దోపిడి వ్యవస్థకు అధినేత జగన్

- చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారు : యనమల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

దోపిడీ వ్యవస్థకు జగన్ అధిపతి అని, యువతను దెబ్బతీయడమే జగన్ క్రిమినల్ ఆలోచన అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో లోకేష్ బస వద్ద ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. సిఐడిని జేబు సంస్థగా మార్చుకుని తప్పుడు ఆరోపణలతో మచ్చలేని చంద్రబాబును అరెస్టు చేశారని, ఆయనపై అక్రమ కేసులు పెట్టారన్న విషయం ప్రజలందరికీ తెలుసని అన్నారు. రాష్ట్రానికి ప్రపంచంలోనే గుర్తింపు తెచ్చిన వ్యక్తిని జైల్లో పెట్టినందుకు ప్రజలే స్వచ్ఛందంగా నిరసన తెలుపుతున్నారని చెప్పారు. తక్కువ ఖర్చుతో సీమెన్స్ సంస్థ ద్వారా పేద యువతకు ట్రైనింగ్ ఇస్తే ఉద్యోగాలొస్తాయన్న ఉద్దేశంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. తండ్రి అధికారంతో వేలకోట్లు జగన్ దోచుకున్నట్లు తాము గతంలోనే నిరూపించామని అన్నారు. దొంగకు తాళాలు ఇస్తే ఎలా ఉంటుందో జగన్ సిఎం కాకముందే చూపించారని, రూ.43 వేల కోట్ల ఆస్తులను సిబిఐ అటాచ్ చేసిందని గుర్తు చేశారు. క్రిమినల్ మైండ్ ఉన్న వ్యక్తి ఏ విధంగా చంద్రబాబుకు భద్రత కల్పిస్తారని ప్రశ్నించారు. ఎటువంటి అక్రమ కేసులనైనా న్యాయపరంగా ఎదుర్కొంటామని అన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

- ముగ్గురు యవకులు మృతి

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన మర్రిబోయిన మణికంఠ (21), బత్తిన అరవింద్ (19), మర్రిబోయిన గోపి (28) కలిసి వినాయక విగ్రహం కొనుగోలు కోసం ఒంగోలు వెళ్లి అడ్వాన్స్ ఇచ్చి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నారు. మద్దిరాలపాడు వద్ద అప్పటికే పంచరై ఆగి ఉన్న కంటైనర్ లారీని వారి బైక్ ఢీకొంది. దీంతో, వీరు ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. గోపి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆయనకు భార్య, సంవత్సరం వయస్సు ఉన్న కుమార్తె ఉన్నారు. హైదరాబాద్‌లోని ఓ ఫెర్టిలైజ్ షాపులో అరవింద్ పనిచేస్తున్నారు. మణికంఠ డిగ్రీ చదివి ఉద్యోగ వేటలో ఉన్నారు.

సహిత పోస్టుల దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్ర శిక్షా ద్వారా నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 396 సహిత విద్యా రిసోర్స్ పర్సన్స్ పోస్టులకు దరఖాస్తు తేదీని పొడిగిస్తున్నట్లు సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 18తో ముగుస్తున్న గడువును ఈ నెల 21 వరకు పొడిగిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల వారు apie.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

త్వరలో రాష్ట్రానికి రాహుల్, ప్రియాంక, ఖర్గే

- గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

త్వరలో రాష్ట్రానికి రాహుల్, ప్రియాంక, ఖర్గేలు రానున్నారని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. పార్టీ అగ్రనాయకత్వం పాల్గొనేందుకు వీలుగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో మూడు బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు విశాఖలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే సభలో రాహుల్‌గాంధీ, విజయవాడ సభకు ప్రియాంకగాంధీ, తిరుపతి, అనంతపురాల్లో జరిగే సభకు పార్టీ విపక్షనేత మల్లికార్జున ఖర్గే పాల్గొనే విధంగా సభలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అర్హత సాధించి.. అపాయింట్‌మెంట్ కోసం 25 ఏళ్ల నిరీక్షణ

- అలుపెరగక పోరాడుతున్న 1998 డీయస్సీ అభ్యర్థులు
- నిర్లక్ష్యం వహిస్తున్న పాలకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒకటి కాదు..రెండు కాదు...ఏకంగా 25 ఏళ్ల నుంచి నిరంతర పోరాటం.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపధ్యాయులుగా సేవలందించాలనే తపన వారిని ఉద్యమబాటలో నడిపిస్తోంది. 1998 డియస్సీ అభ్యర్థులకు న్యాయం చేస్తామని పాలకులు హామీలు గుప్పించినా..అవన్నీ నీటి మీద రాతలయ్యాయి. మీన మేషాలు లెక్కిస్తూ భావి ఉపాధ్యాయుల బతుకులతో ఆడుకుంటున్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ పాదయాత్ర సమయంలో 98 డిఎస్సీ అభ్యర్థులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆయన పదవీకాలయం ముగింపు దశకు వచ్చినా ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మీన మేషాలే లెక్కిస్తూ వచ్చారు.

ఇది నేపథ్యం : 1998లో ఉపాధ్యాయ నియామకాల కోసం జరిగిన డిఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినవారిలో ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యం కారణంగా దాదాపు రెండున్నర వేల మందికి ఉపాధి ఆశలు గల్లంతయ్యాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడం కారణంగా 2326 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు రాకుండా పోయాయి. ప్రభుత్వాధికారుల తప్పుల వల్ల 8 జిల్లాల అభ్యర్థులు నష్టపోవాల్సి వచ్చింది. వీరిలో అత్యధిక మంది బడుగు బలహీన తరగతులకు చెందినవారే. అర్హత సాధించినవారిలో కొందరు వయస్సు పైబడి, అనారోగ్యంతో చనిపోయారు. మొత్తం 2428 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సివుంది. వీరిలో ఇప్పటికే 182 మంది అభ్యర్థులను 60 ఏళ్ల దాటినవారిగా నిర్ధారించి వారిని అర్హుల జాబితా నుంచి తొలగించారు. మరో 136 మందికి ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఉద్యోగ విరమణ దాటిపోనుంది. దీంతో వారినీ జాబితా నుంచి తీసేశారు. ఇక మిగిలింది 2326 మంది అభ్యర్థులే. వీరిలో 653 మంది జనరల్ కేటగిరి అభ్యర్థులున్నారు. 1021 మంది, బిసి, 652 మంది ఎస్సీ సామాజిక తరగతులకు చెందినవారున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ 1998 డిఎస్సీ అభ్యర్థులు విజయవాడలోని ధర్నా చౌక్‌లో వారం రోజులుగా రిలే దీక్షలు చేపట్టారు. అర్హత పొందినవారందరికీ తక్షణమే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని కోరారు. 2022 సెప్టెంబరులో జరిగిన శాసనసభ సమావేశాల్లోనూ వీరందరికీ న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. ఏడాది గడుస్తున్నా ఆయన హామీ అమల్లోకి రాలేదు. 1998 డిఎస్సీ అభ్యర్థుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంలో అధికార యంత్రాగం కూడా విఫలమైందని డిఎస్సీ అభ్యర్థులు విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికైనా తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై స్పష్టమైన ప్రకటన చేసి వెంటనే నియామకాలు చేపట్టాలని కోరారు.

ఐదవ రోజుకు రిలే దీక్షలు

1998 డిఎస్సీలో అన్యాయం జరిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఐదవ రోజు దీక్షలను రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు కుర్రా శ్రీనివాస్ యాదవ్, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, సభ్యులు కృష్ణ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ప్రారంభించి, పాల్గొన్నారు. దీక్షలను ఉద్దేశించి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రతిపక్ష నాయకుడుగా పాదయాత్ర సందర్భంగా 98 డీయస్సీ అభ్యర్దులు నష్టపోకుండా ఉద్యోగాలు ఇస్తామంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కల్పించుకోని అభ్యర్దులందరికి ఉద్యోగా అవకాశాలు ఇవ్వాలని , లేనిపక్షంలో పెద్ద ఎత్తున అందోళన కార్యక్రమాలు చేపడతామనిఅన్నారు. రిలే దీక్షలో శ్రీనివాసులు, మేరీ సుహాసిని, రమేష్, మాధవి, బాబయ్య, మహబూబ్ బాష, ఊర్మిళ, జయదేవి, కోమలి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని ధర్నా చౌక్‌లో దీక్ష చేస్తున్న 1998 డిఎస్‌సి అభ్యర్థులు

ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోండి

- మంత్రి ధర్మానకు యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఉపాధ్యాయులపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని పొగడవని, ఎప్పుడూ నిందిస్తూ ఉంటాయని చేసిన వ్యాఖ్యలు సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిఏటా వేలకోట్ల రూపాయలు విద్యారంగంపై ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, దీనివల్ల ప్రభుత్వ విద్యారంగం బలపడితే సంతోషించే వారిలో ఉపాధ్యాయ సంఘాలే ముందు ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టినా విద్యారంగానికి ఎన్ని హంగులు చేకూర్చినా వాస్తవంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందో మంత్రి చెప్పాలని కోరారు. ఉపాధ్యాయులను పాఠాలు చెప్పనీయకుండా బోధనేతర పనులు ఎందుకు అప్పగిస్తున్నారో, 12వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎందుకు ఏర్పడ్డాయో మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. జూన్‌లో ప్రభుత్వపరంగా బదిలీలు నిర్వహించి, దొడ్డిదారిన వందలాది అక్రమ బదిలీలు ఎందుకు చేస్తున్నారో? ఇంతవరకు జీతాలు ఎందుకు చెల్లించలేకపోయిందో చెప్పగలరా అని ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేస్తున్న ఉపాధ్యాయులు నూటికి 90శాతానికి పైగా ఉన్నారనే విషయం మంత్రి గ్రహించాలని సూచించారు. ఎంతో ఒత్తిడికి గురవుతూనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో రాజీలేకుండా పనిచేస్తున్న ఉపాధ్యాయులను నిందించడం మంత్రిస్థాయికి తగదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులను కించపరుస్తూ మాట్లాడటం ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరుస్తున్నామనే విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై, సంఘాలపై మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 'ఉపాధ్యాయ సంఘాలు అత్యంత ప్రమాదకరమ'ని మంత్రి ధర్మాన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్టియు ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న తెలిపారు. ఈ వాఖ్యలను తక్షణం ఉపసంహరించుకొని ఉపాధ్యాయులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రికి ఫేషియల్ యాప్‌కు, థంబ్‌కి తేడా తెలియకపోవడం విచారకరమని ఫ్యాప్టో శ్రీకాకుళం చైర్మన్ మదన్ మోహన్, సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు మరో ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రుల పలుకుబడితో బదిలీలు పొందిన కొందరు ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలలకు సరిగా వెళ్లకుండా వ్యక్తిగత పనులు చూసుకుంటున్నారని పేర్కొన్నారు.

బిజెపి, బిఆర్ఎస్ మోసకారి పార్టీలు

(మొదటి పేజీ తరువాయి)

నష్టపోతున్నారు. ప్రయివేటీకరణతో దేశంలో యువతకు ఉపాధి దొరకడం లేదు. నిరుద్యోగం ప్రధాన సమస్యగా మారింది' అని సిడబ్ల్యుసి సమావేశం పేర్కొంది.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందని, అందరినీ కలుపుకొనిపోయే పరిపాలన కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని సమావేశం తీర్మానించింది. బంగారు తెలంగాణ కల సాకారం చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని తెలంగాణ ప్రజలకు సిడబ్ల్యుసి విజ్ఞప్తి చేసింది.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.2,500

తెలంగాణ వికాసం కాంగ్రెస్ పార్టీ విధి అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలూ మద్దతివ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఆదివారం హైదరాబాద్ శివారు తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో టిపిసిసి నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలో లక్షలాది ప్రజలనుద్దేశించి సోనియా గాంధీ ప్రసంగించారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రజలకు ఆరు వాగ్దానాలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ వెంటనే వీటిని అమలు చేస్తామని ప్రకటించారు.

- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.2,500, పేద మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు టిఎస్ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం
- రైతు భరోసా కింద ఏటా రైతుకు రూ.15 వేలు. (కౌలు రైతులకూ వర్తింపు). భూమిలేని నిరుపేదలు, వ్యవసాయ కార్మికులకు ఏటా రూ.12 వేలు. వరి రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్
- గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం
- యువవికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల వరకు సాయం
- చేయూత పథకం కింద అర్హులకు నెలకు రూ.4 వేల పింఛను





హైదరాబాద్‌లో పోటాపోటీ ర్యాలీలు

- జగన్‌కు మద్దతుగా ఐటి ఉద్యోగుల కార్ల ర్యాలీ
- చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి అభిమానుల ఆందోళనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు మద్దతుదారులు ఆదివారం పోటాపోటీగా ఆందోళనలు చేశారు. జగన్‌కు మద్దతుగా ఐటి ఉద్యోగులు కార్లతో ర్యాలీ చేపట్టగా, చంద్రబాబుకు మద్దతుగా నందమూరి సుహాసిని ఆందోళనలో పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా హైదరాబాద్ మధురానగర్‌లో 'ఐయామ్ విత్ సిబిఎన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుహాసిని పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు మంచి విజన్ ఉన్న నాయకుడని, ఆయనను అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇలాంటి అరెస్టులతో టిడిపిని ఆపలేరని, ఇంకా బలోపేతం అవుతామని చెప్పారు. ఇసిఐఎల్‌లో టిడిపి మద్దతుదారులు మౌనదీక్ష నిర్వహించారు. వనస్థలిపురంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఎల్బీనగర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బిజెపి కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి తదితరులు టిడిపి అభిమానులకు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. పనామా సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా హైదరాబాద్‌లోని ఐటి ఉద్యోగులు కీసర ఔటర్ రింగ్ రోడ్ నుంచి గచ్చిబౌలి వరకు కార్ల ర్యాలీ నిర్వహించారు. జై జగన్.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. స్కామ్ చేశారు కాబట్టే టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు అరెస్ట్ అయ్యారని ఐటి ఉద్యోగులు అన్నారు. ఒఆర్ఆర్ కట్టింది.. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ తెచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, ఇక్కడ చంద్రబాబు చేసిన అభివృద్ధి ఏమీ లేదనీ తెలిపారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్, గచ్చిబౌలి వచ్చింది వైఎస్ఆర్ హయాంలోనేనని వారు పేర్కొన్నారు.

యువరైతు ఆత్మహత్య



ప్రజాశక్తి - పెద్దవడుగూరు

అప్పుల బాధ తాళలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన రాము (30) తనకున్న రెండెకరాలతోపాటు మరో తొమ్మిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశారు. అధిక వర్షాలు, పురుగు బెడద కారణంగా పంట పూర్తి స్థాయిలో నష్టపోయారు. కనీసం పంటకు పెట్టిన పెట్టుబడులు సైతం దక్కలేదు. పంట సాగు కోసం సుమారు రూ.6 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పుల భారం అధికమవ్వడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అప్పులు తీర్చే మార్గంలేక ఇంట్లోనే పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆయనను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రామునకు భార్య గాయత్రి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు చెప్పారు.

'నినాదాలకే పరిమితమైన బేటీ బచావో.. బేటీ పడావో'

- సనాతనం పేరుతో మహిళను వంటింటికే పరిమితం చేసే కుట్ర
- ముగిసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్
- నూతన కమిటీ ఎన్నిక



రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.పావని



కో-కన్వీనర్ టి.సుచరిత



కో-కన్వీనర్ కె.నవిత




కో-కన్వీనర్ పి.రజిత

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

కేంద్రంలోని బిజెపి పాలనలో బేటీ బచావో.. బేటీ పడావో నినాదాలు మాటలకే పరిమితమయ్యాయని, పైగా సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేసేలా బిజెపి, ఆర్ఎస్ఎస్, వాటి అనుబంధ సంఘాలు వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ విమర్శించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లయోలా ఇంజనీరింగ్ కాలేజీలో రెండ్రోజులపాటు జరిగిన విద్యార్థినుల రాష్ట్ర కన్వెన్షన్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని, హాస్టళ్లలోని విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్ అందించాలని, పీరియడ్స్ సమయంలో విద్యార్థినులకు నెలకు రెండ్రోజులు సెలువులు ఇవ్వాలని, నూతన విద్యావిధానాన్ని రద్దు చేసి బాలికా విద్యను ప్రోత్సహించాలి, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో మహిళా జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను కన్వెన్షన్ ఆమోదించింది. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లకల్లోలం జరుగుతున్నా దానిపై నోరు మెదపని ప్రధాని మోడీ... సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై మాత్రం వెంటనే స్పందించడం సిగ్గుచేటన్నారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలకు పాల్పడేవారికి బిజెపి, దాని అనుబంధ సంఘాలు మద్దతుగా నిలవడం మహిళల పట్ల వాటి దృష్టికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. మహిళల పట్ల వివక్షను పెంచే రీతిలో వ్యవహరించే బిజెపి పట్ల రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు నోరు మెదకపోవడం బాధాకరమన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా రాష్ట్ర గర్ల్స్ కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా సిహెచ్.పావని, కో-కన్వీనర్లుగా టి.సుచరిత (గుంటూరు), కె.నవిత (పల్నాడు), పి.రజిత (అనంతపురం), జహీదా (ఎన్‌టిఆర్ జిల్లా) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కె.సాయికుమార్, ఉపాధ్యక్షులు డి.అమూల్య, రమాదేవి, సహాయ కార్యదర్శులు లక్ష్మణ్, వి.సిద్ధు, నాయకులు ప్రసాద్, గోవిందు, గుణ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కిడ్నీ బాధితుల సమస్యపై శాసన మండలిలో లేవనెత్తుతా

- ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-పిసిపల్లి (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా పిసిపల్లి మండలంలో రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ వ్యాధి తీవ్రత గురించి, మంచినీటి సమస్య గురించి శాసన మండలిలో లేవనెత్తుతానని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. ప్రకాశం జిల్లా అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని సిపిఎం చేపట్టిన పాదయాత్ర ఆదివారం పిసిపల్లి మండలంలోని పెద అలవలపాడుకు చేరింది. పాదయాత్రకు లక్ష్మణరావు సంఘీభావం తెలిపి.. పాదయాత్రలో నడిచారు. ఈ సందర్భంగా పెదఅలవలపాడులో కనిగిరి డివిజన్ నాయకులు బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఒక వైపు చంద్రయాన్-3ను ప్రయోగించి దేశం అభివద్ధి వైపు పయనిస్తుంటే.. మరోవైపు స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా గుక్కెడు మంచినీళ్లు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో పాలకులు ఉన్నారని అన్నారు. కనిగిరి నియోజకవర్గంలో మొత్తం 115 మంది డయాలసిస్ రోగులు ఉండగా, ఒక్క పిసిపల్లి మండలంలోనే 40 మంది వరకు డయాలసిస్ రోగులు ఉండడం బాధాకరమన్నారు. ఈ ప్రాంతంలోని నీళ్లలో ఫ్లోరోసిస్, విష రసాయనాలు అధికంగా ఉండడం వల్ల ఈ ప్రాంత ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో పిసిపల్లిని చేర్చాలని, ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్, జిల్లా నాయకులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు మాట్లాడారు. ఈ పాదయాత్ర రామాపురం నుండి ప్రారంభమై పెదఅలవలపాడు, పాలేటి గంగమ్మ గుడి మీదుగా పొన్నలూరు మండలం పరుచూరివారిపాలెం వరకు సాగింది.

పెరియార్‌కు ఘన నివాళి

చెన్నై : ద్రవిడ ఉద్యమ పితామహులు, సామాజిక సంస్కర్త పెరియార్ ఇవి రామస్వామి 145 జయంతి సందర్భంగా తమిళనాడు వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. సేలంలో ఉన్న పెరియార్ విగ్రహానికి తమిళనాడు యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉధయనిధి స్టాలిన్ పూలమాల వేసి నివాళి అర్పించారు. సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్ ముత్తుస్వామి, సేలం జిల్లా కలెక్టర్ ఎస్ కర్మేగం, ఎమ్మెల్యే ఆర్ రాజేంద్రన్, సేలం కార్పొరేషన్ మేయర్ ఎ రామచంద్రన్ కూడా పాల్గొన్నారు.

పెరియార్ జయంతి సందర్భంగా వెల్లూరులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నివాళి అర్పించారు. ఈ రోజున డిఎంకె ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటికీ పెరియారే అధారం అని స్టాలిన్ ట్వీట్ చేశారు. 'పెరియార్ జీవితం రాజకీయ తత్వశాస్త్రం. భాష, దేశం, మతాలకు అతీతంగా మానవత్వం, ఆత్మగౌరవం ఆధారంగా రాజకీయాలను నొక్కి చెప్పిన గొప్ప సంస్కర్త. మహిళా విముక్తి కోసం, సమ సమాజం కోసం మన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నింటికీ పెరియారే ఆధారం' అని స్టాలిన్ ట్వీట్ చేశారు.

సిబిఐ కూడా న్యాయం చేయలేదు

- సిబిఐ బృందంపై ఆయేషామీరా తల్లిదండ్రుల ఆగ్రహం
- స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు నిరాకరణ
- రీ పోస్ట్‌మార్టం ఏమైందంటూ నిలదీత



ఆయేషామీరా తల్లిదండ్రులతో సిబిఐ బృందం

ప్రజాశక్తి-తెనాలి

అయేషా మీరా హత్య కేసులో సిబిఐ కూడా న్యాయం చేయలేదని ఆయేషా మీరా తల్లిదండ్రులు ఇక్బాల్ బాషా, షంషాద్‌బేగం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దాదాపు ఐదేళ్ల క్రితం రీ పోస్ట్‌మార్టం అన్నారు. మతపరంగా ఇబ్బందులు ఎదురైనా సిబిఐకి సహకరించాం. దర్యాప్తులో అడుగు కూడా ముందుకు పడలేదు. మేము నిందితులుగా పేర్కొన్న ఏ ఒక్కరినీ దర్యాప్తు సంస్థ ప్రశ్నించలేదు. దర్యాప్తుపై నమ్మకం పోయింది. ఇప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వలేం' అంటూ సిబిఐ బృందంపై మండిపడ్డారు. గుంటూరు జిల్లా తెనాలికి ఇక్బాల్ బాషా, షంషాద్ బేగం కుమార్తె ఆయేషా మీరా విజయవాడ ఇబ్రహీంపట్నంలో బి.ఫార్మసీ చదువుతూ 2007 డిసెంబర్ 26న హాస్టల్‌లో దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఉమ్మడి కృష్ణా జిల్లా అనాసాగరానికి చెందిన పిడతల సత్యంబాబును దోషిగా చూపడంతో విజయవాడ మహిళా కోర్టు ఆయనకు జీవితఖైదు విధించడం, తదుపరి సత్యంబాబు ఆ తీర్పును సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించడం, ఆయనను నిర్దోషిగా కోర్టు విడుదల చేయడం విధితమే. ఈ నేపథ్యంలో ఈ కేసును సిబిఐ దర్యాప్తునకు స్వీకరించింది. దర్యాప్తులో భాగంగా 2019 డిసెంబర్ 14న ఆయేషా మీరా మృతదేహానికి సిబిఐ బృందం రీ పోస్టుమార్టం నిర్వహించింది. ఆమె మృతదేహం నుంచి కొన్ని అవశేషాలను సేకరించి, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు అప్పట్లో సిబిఐ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకూ దర్యాప్తు విషయంలో మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం లేదు. దీనిపై మరలా స్టేట్‌మెంట్ కోసమంటూ ఆదివారం విశాఖపట్నం నుంచి సిబిఐ అడిషనల్ ఎస్‌పి దాస్, రాజేష్, కమరుద్దీన్ బృందం అయేషా ఇంటికి వచ్చి ఆమె తల్లిదండ్రులను కలిశారు. సిబిఐ బృందాన్ని చూడగానే వారిరువురూ కన్నీటి పర్యంతమయ్యారు. సిబిఐ కూడా తమకు న్యాయం చేయలేదని అన్నారు.

రీ పోస్టుమార్టం సందర్భంలో ఖననం చేసిన మృతదేహాన్ని వెలికితీసేందుకు తమ మతాచారాలు అంగీకరించవని చెప్పామని, అయినా హైకోర్టు అనుమతితో వెలికి తీశారని, ఆ భాగాలను పది రోజుల్లో మళ్లీ ఖననం చేస్తామని చెప్పిన సిబిఐ బృందం వాటిని ఇప్పటికీ తమకు అప్పగించలేదని వాపోయారు. అదేమని అడిగితే వాటిని కోర్టుకు అప్పగించామంటున్నారని అన్నారు. రీపోస్ట్‌మార్టంపై తమకు వివరాలు వెల్లడించలేదని, దాదాపు ఐదేళ్ల తర్వాత స్టేట్‌మెంట్ కోసం ఎలా వచ్చారని ప్రశ్నించారు. తాము ఆరోపించిన వారిలో ఏ ఒక్కరినీ విచారించకుండా, దర్యాప్తులో అడుగు కూడా ముందుకు వేయకుండా మరలా స్టేట్‌మెంట్ ఏమిటని నిలదీశారు. ఏ ఒక్కరినైనా అరెస్ట్ చేస్తే, స్వయంగా కార్యాలయానికి వచ్చి స్టేట్‌మెంట్ ఇస్తామని తేల్చిచెప్పారు. చివరికి సిబిఐ అధికారులు ఆయేషామీరా కుటుంబానికి చెందిన న్యాయవాది శ్రీనివాస్‌తో మాట్లాడి అక్కడి నుంచి నిష్క్రమించారు.



శ్రీవారి దర్శనానికి రాంనాథ్ కోవిద్

ప్రజాశక్తి- తిరుమల

భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శ్రీవారి దర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సమేతంగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డుమార్గంలో తిరుమలకు రామ్‌నాథ్ కోవింద్ చేరుకున్నారు. ఆయనకు టిటిడి ఇఒ ధర్మారెడ్డి ఘనంగా స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం రామ్‌నాథ్ కోవింద్ కుటుంబానికి దర్శన ఏర్పాట్లు చేసినట్లు ఆలయాధికారులు తెలిపారు.

కొబ్బరి దిగుమతులను నిషేధించాలి

- కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సులో తీర్మానం
- ఎపి కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా కె శ్రీనివాస్



కె.శ్రీనివాస్



బత్తిన లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిషేధించాలని కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో జరిగే కొబ్బరి రైతుల నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరింది. ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఈ సదస్సులో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వెయ్యి కొబ్బరికాయలకు రూ.15 వేలు కనీస మద్దతు ధర ప్రకటించాలని, నాఫెడ్ కొనుగోలు కేంద్రాలను కొబ్బరి పంట సాగయ్యే అన్ని జిల్లాల్లో తెరవాలని, రాష్ట్ర ప్రభుత్వం కొబ్బరి రైతులకు ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలని, కేరళ తరహాలో సహకార రంగంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని, ఎర్రనల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవా లని, 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీ పథకాలు అందించాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల బిగింపు ఆపాలని, ఉచిత విద్యుత్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎపి కొబ్బరి రైతు సంఘం రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు ఎపి కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ ఏర్పాటైంది. కన్వీనర్‌గా కె.శ్రీనివాస్ (ఏలూరు), కో-కన్వీనర్‌గా బత్తిన లక్ష్మీనారాయణ (శ్రీకాకుళం), కమిటీ సభ్యులుగా సాతుపల్లి కాంతారావు (శ్రీకాకుళం), నిప్పుల గోవిందరావు, చిటుగు సత్యనారాయణ (విజయనగరం), గుర్రాల అప్పారావు (కాకినాడ), కంకటాల బుద్ధుడు, ముదునూరి రఘురామరాజు (తూర్పుగోదావరి), బొల్లి రామకృష్ణ, బి.బలరామరాజు, గుదిబండి వీరారెడ్డి (ఏలూరు) తూటే మార్టిన్ లూథర్ (పశ్చిమ గోదావరి) ఎన్నికయ్యారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ

ప్రజాశక్తి-విజయవాడ



"మణిపూర్ మంటలు", "అక్షరమా నీకు వందనం" పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వక్తలు

నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూనే మరొక వైపు మత మూఢత్వంలోకి వెళు తున్నారని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోడానికి హేతువాద సాహిత్యం దోహదం చేస్తుందని అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. మూఢ విశ్వాసాలను నమ్మొద్దని సూచించారు.

ద్రవిడ నాట హేతువాద ఉద్యమ పితామహులు, సంఘసంస్కర్త, పెరియార్, అరసం వ్యవస్థాపక అధ్యక్షులు తాపీ ధర్మారావు జయంతి సందర్భంగా అరసం ఆధ్వర్యంలో విజయవాడ ప్రజాశక్తి నగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో సాహిత్య సభ ఆదివారం జరిగింది. అరసం ప్రచురించిన "మణిపూర్ మంటలు", "అక్షరమా నీకు వందనం" పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ తొలి రోజుల్లో ఆనాటి సమాజాన్ని శాసిస్తున్న మూఢ విశ్వాసాలు, అస్పృశ్యతకు వ్యతిరేకంగా నాస్తిక, హేతువాదాన్ని ముందుకు నడిపించారని, ఆయన వారసత్వాన్ని నేడు తమిళనాడు కేంద్రంగా స్టాలిన్, ఉదయనిధి వంటి వారు కొనసాగిస్తున్నారని తెలిపారు. జన సాహితి కార్యదర్శి దివికుమార్, అరసం రాష్ట్ర కార్యదర్శి బి.ఎన్ సాగర్ మాట్లాడుతూ నిజాం వ్యతిరేక సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర గొప్పదని అన్నారు. ఎపి ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రానాయక్ అభ్యుదయ గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొప్పర్తి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, కార్యదర్శి మోతుకూరి అరుణ కుమార్, ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి మందగళ్ళ సాయి కుమార్, అధ్యాపకులు వేణు గోపాల్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షునిగా ఎన్నికై తొలిసారి నగరానికి విచ్చేసిన పెనుగొండను సత్కరించారు.

పని ఒత్తిడి తగ్గించాలి

- ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు
- 1న విజయవాడలో ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

రెవెన్యూ శాఖ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబర్ 1న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర 17వ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గుంటూరులో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పరాజు విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పుడు పని భారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని చెప్పారు. పనికి తగినట్లుగా మండల స్థాయిలో సిబ్బంది, నిధులు, సౌకర్యాలు లేవన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఎన్నికల ప్రక్రియలో ఉన్నందున ఆరోగ్య సర్వే, హౌసింగ్, ఇరిగేషన్, సివిల్ సప్లైస్ వంటి ఇతర అదనపు పనుల నుండి తాత్కాలికంగా మినహాయింపు ఇవ్వాలని కోరారు. సాధారణంగా వంద రోజులు పట్టే రీ సర్వేను 15 రోజుల్లో పూర్తి చేయాలని చెప్తున్నారని, సాధ్యం కాదని చెబుతున్నా చేయాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణతోపాటు, 2022 జనవరిలో వచ్చిన క్లైమ్‌లు కూడా ఇప్పుడు రీ వెరిఫికేషన్ చేయాలని చెప్పడం సరికాదన్నారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పని భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి యం.వెంకటరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఘనంగా విమోచన దినోత్సవ వేడుకలు

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. జాతీయ జెండాను ఆవిష్కరించి నిజాం సంస్థానం పరిధిలోని తెలంగాణ, కల్యాణ కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలను ఆయన తిలకించారు. షోయబుల్లాఖాన్, రాంజీ గోండు పేరిట పోస్టల్ కవర్లను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ పటేల్ చొరవతోనే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందని, చుక్క రక్తం బొట్టు కారకుండా హైదరాబాద్ విలీనానికి నిజాం అంగీకరించేలా ఆయన మెడలు వంచారని పేర్కొన్నారు. పటేల్, మున్షీ కలిసి ఆపరేషన్ పోలో పేరిట సైనిక చర్యను విజయవంతంగా చేపట్టారన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే గత ప్రభుత్వాలు విమోచన దినోత్సవాలను నిర్వహించలేదని విమర్శించారు. హైదరాబాద్ సంస్థానంలో పూర్వీకుల బలిదానాలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. సాయుధ బలగాల కోసం 80 ఎకరాల స్థలంలో నిర్మించనున్న స్వశస్త్ర సీమా బల్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఐక్య పోరాటాలు

- సిడబ్ల్యుఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి జోసెఫ్
- ముగిసిన జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి-నెల్లూరు

భవన నిర్మాణ రంగం కార్మికులు పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను ఆ రంగం కార్మికుల సంక్షేమానికే ప్రభుత్వాలు ఖర్చు చేయాలని, ఇతర ప్రభుత్వ పథకాలకు మళ్లించకూడదని సిడబ్ల్యుఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి యుపి జోసెఫ్ డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు నిధుల సద్వినియోగం కోసం కార్మికులు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం అఖిల భారత కమిటీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జోసెఫ్ మాట్లాడుతూ.. మూడు రోజులపాటు జరిగిన సమావేశాలకు దేశంలోని 19 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారని, దేశంలో నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పని భద్రత, వేతనాలకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించాల్సిన పోరాటాలకు, ఆందోళనలకు ఈ సమావేశంలో ఒక కార్యరూపాన్ని రూపొందించుకున్నామని చెప్పారు. దేశంలోని కేరళలో మాత్రమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు నిధులు ఖర్చు చేస్తూ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 22 శాతం నిధులను మాత్రమే ఖర్చు చేస్తూ మిగిలిన నిధులను ఇతర ప్రభుత్వ పథకాలకు దారి మళ్లిస్తున్నారని అన్నారు. మరికొన్ని రాష్ట్రాల్లో ఈ వెల్ఫేర్ బోర్డు నిధులు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. దేశ వ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాటాలు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎక్కువ శాతం కార్మికులు జాతీయ రహదారుల నిర్మాణం, పోర్టులు, రైల్వే లైన్లు, ప్రాజెక్టుల నిర్మాణం రంగంలో పనిచేస్తున్నారని, వీరందరికీ ఇఎస్ఐ, పిఎఫ్, కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాబోవు రోజుల్లో సిడబ్ల్యుఎఫ్ఐ పని చేయాలని సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి.నరసింహారావు, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి గోపాల్, రూరల్ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి కొండా ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

అక్షరం

4 | విజయవాడ
సోమవారం 18 సెప్టెంబర్ 2023



"ఏ కృతికి ఆ కృతే భాష్యం. కృతికర్త చెప్పలేని ఏ విషయాన్నీ భాష్యకారుడు చెప్పలేడు. పైగా అందులోని మృదుత్వాన్ని చెరుస్తాడు."
– ఆలూరి బైరాగి



అనార్య ధర్మం

విద్యార్థియై వచ్చి
వినమ్రంగా విద్య నేర్పమని వేడుకుంటే
నిషాదుడవు..
విప్రులెల్లనేర్చిన విద్య నీకు నేర్పకూడదని
ముఖతః ఉమ్మివేసి తిరిగి పంపించావు!

పట్టుదలనే పెట్టుబడిగా
విలువిద్యతో లోకాన్ని అబ్బురపరిచిన
ఏకలవ్యుడి బొటన వేలిని కొసరి
గురుశిష్యుల బంధాన్ని
కపటోపాయపు తాళ్లను విసరి
కొనఊపిరితో మిగిల్చావు
పాండవ మధ్యముని కోరిక
తీర్చిన కసాయి ద్రోణుడా
నువ్వింకా మా మధ్యలోనే
ఆచార్య అవార్డుతో
మా ప్రతిభల్ని గేలి చేస్తూనే
మా వేళ్లను తుంచమని
సనాతనపు బాణాలు విసురుతున్నావు!

వేద వేదాంగ పండితుడు
మానవోత్తముడు
ఋషీశ్వరుడై తపస్సులో
తమస్సులు నిండిన
మనస్సీమల్ని వెలుగులతో
ప్రజ్వరిల్లింప చేస్తుంటే
లోకం ధర్మం తప్పిందని
శూద్రుడు వేదం చదవటం నేరమని
యజ్ఞ యాగాలు చేయటం ఘోరమని
శ్రీరాముణ్ణి వేడుకున్న పిలక జంధ్యాలు
సనాతనపు కత్తిని చేతికందించి
తలను నరకమని చెప్పిన
సద్బ్రాహ్మణ పరమ హంసలు
ఇంకా ఈ నేల మీద విద్వేషపు
ప్రకటనలు చేస్తూనే
శంభూకుల్ని చెరబడుతూ
తలలకు వెలలు ఒసుగుతున్నారు!

నీ బొడ్రాయి పండుగలో
నేను పాలు పొంగించకూడదు
నీ శివాలయం తలుపులు దాటి
గన్నేరు పూవునై అర్చన కాకూడదు
పూరీలో రథ చక్రాన్ని లాగడానికి
నా భుజాన్ని మీ భుజాలకు సాయం కూడదు
దేవుడి ముందు నన్నో అంటరాని వాణ్ని చేసి
నవ్వుకున్న మీ ధర్మం
నాకు మూతికి ముంతనిచ్చి
ముడ్డికి తాటాకు కట్టి
మెడలో గంట వేలాడదీసి.. హీన పరిచిన మీ ధర్మం
చెరువులో నీళ్లలో తెల్ల తామరై విరిసినమా మాదిగ అక్కను
చెర్నాకోలతో గొడ్డును కొట్టినట్టు కొట్టి
మా గూడేల్ని భస్మం చేసిన
కారంచేడు మీ కుల ధర్మం
చుండూరుని ఎముకల గుట్టను చేసి
మూట గట్టిన మీ కుల న్యాయమే
సనాతన ధర్మం అయితే
మీ ధర్మాన్ని ప్రశ్నించే ఉదయనిధి కంఠాలై
సింహనాదం చేస్తూనే ఉంటాం...
మీ సనాతనపు గడ్డి కొండకు
అగ్గిపుల్లను గీసి చలి కాచుకుంటాం!

– నేలపూరి రత్నాజీ
89199 98753

ఇదీ, నేటి దేశభక్తి!

సొంత సంపద పెంచుమన్నా
మంచిగా జనాలతో మాట్లాడమన్నా
శుష్క వాగ్దానాలు చెప్పవోయ్
శూన్య ఆచరణ చెప్పబోకోయ్
కొంగ మాటలు చెప్పి,
ఓట్లు పొర్లే దారిలో నువ్వు అడుగు వేయవలెనోయ్
దండిగా దోచిపెడితే
అగ్ర సింహాసనం నీదేనోయి
దారిద్య దిగువున మనుషులుంటేనే
ఏలికల జాతి బాగుపడునోయ్?
సర్దుకొని సంపదలెల్ల దోచుకుని
పరదేశాలకు తరలింపవోయ్

అన్ని దేశాల్లో మన సొమ్మే కుమ్మవలనోయి
విదేశీ సరుకులు ఇచ్చట తెగ నమ్మవలనోయి
డబ్బు దోచిపెట్టె నాయకుల చెంతకే
పదవి, ప్రతిఫలాలు చేరునోయ్


వెనుక చేసిన ఘనము లేదోయ్
వ్యక్తిగతము కొంచమేనోయ్
మందు తాగి నువ్వు చిందులెయ్యవోయ్
వినాయకుల వెనుక బలమ దేనోయ్

జనాభిమానము నాకు కద్దని
ఒట్టి గొప్పలే చెప్పవలనోయి
పూని ఏదైనా సొంతమేల్
చూసుకొను వాడే ఘనుడోయ్
స్వలాభమే నంతా చూసుకొని
పొరుగు వాడికి హామీలివ్వవలెనోయ్
దేశమంటే ప్రగతి కాదోయ్
దేశమంతా మా మనుషులే యేలవలెనోయ్

మతములెన్నివున్నా నేమినోయ్
స్వమతస్తులే అధికారము నందు నుండవలెనోయ్,
స్వజాతి నన్నది పెరిగి
లోకమంతా వెలగవలనోయ్!

– డాక్టర్ జివిఎస్ జయపాలరావు
94920 20115

చేతివృత్తుల దృశ్యమాల 'మల్లెసాల'



ప్రముఖ రచయిత్రి శ్రీమతి జ్వలిత (విజయ కుమారి) సంపాదకత్వంలో వెలువడిన 'మల్లెసాల' శతాధిక చేతి వృత్తి కథల సంకలనం. ఈ అమూల్య సంకలనాన్ని చేతి వత్తులను నమ్మి అశువులు బాసిన కుటుంబాలకు వివక్షకు గురవుతున్న కుటుంబాలకు 'మల్లెసాల'ను అంకితమిచ్చారు సంపాదకురాలు.

నూటా ముప్పైకి పైగా చేతి వృత్తులకు సంబంధించిన వేదనా సంవేదనల మిళితమే ఈ సజీవగాథలతో కూడిన సంకలనం. వెయ్యికి పైగా పేజీలను పొందుపరచుకొని, కనీవినీ ఎరుగని చారిత్రక, పరిశోధనాత్మక బహత్ గ్రంథమే మల్లెసాల. దేశంలో ప్రవేశ పెట్టబడిన పారిశ్రామికీకరణ వల్ల కులవృత్తులు ఘోరంగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితికి సంపూర్ణంగా చిత్రీకరించాయి ఇందులోని కథలు.

మల్లెసాల పేరు మనల్ని బాగా ఆకర్షిస్తుంది. దాదాపుగా వాడుకలో లేని పదానికి తిరిగి జీవం పొయ్యడమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.'మల్లెసాల' అంటే.. వృత్తికి సంబంధించిన పనిముట్లను, పరికరాలను ఉంచే ఒక అర్ర, ఒక గది, దాన్నే సాయమాను అని కూడా అంటారు.

ప్రాచీన హిందూ సమాజం అగ్రవర్ణ మనువాద బ్రాహ్మణులు ఏర్పరచిన నిచ్చెన మెట్లతో కూడిన చతుర్వర్ణ వ్యవస్థ. బ్రాహ్మణేతర వృత్తిపనులు చేస్తూ సేవలందించే వారిని శూద్రులుగా, బహిష్కృతులుగా పేర్కొంటూ కిందిమెట్టుపై ఉంచి వివక్షతో చూసిన కాలమది. ఈ అట్టడుగున ఉన్న శూద్రుల, చేతివృత్తులు క్రమక్రమంగా కులాలుగా పరిణామం చెందాయి. ఈ కులవృత్తులనే చేతివృత్తులు అనీ, ఆ పనులను నిర్వహించే వీరినే బహుజనులు అని వ్యవహరించడం కూడా అమలుల్లో ఉంది.

19వ శతాబ్దపు ఆరంభంలో చోటు చేసుకున్న పారిశ్రామికీకరణ, తద్వారా వచ్చిన ప్రపంచీకరణ నేపథ్యం కులవృత్తుల్లో పెను మార్పులు సంభవించాయి. ఫలితంగా చేతివృత్తులు తీవ్రంగా దెబ్బతిని ఊహించని విధంగా వృత్తుల విధ్వంసం, వెనువెంటే ఊహించని విషాదం జరిగింది. ఆ పనుల్లో చోటు చేసుకున్న వివిధ పరిణామాలను, అందులోని వేదనలను, ఆ సమస్యల తాలూకా పరిష్కారాలను ప్రతిబింబిస్తూ అక్షరీకరించిన సమగ్ర గ్రంథమే మల్లెసాల.

గతంలో వృత్తులపై వచ్చిన కథా సంకలనాలకు భిన్నంగా జ్వలిత ఈ సంకలనాన్ని తీసుకు రావడం అభినందనీయం. చేతి వృత్తులు పతనమవుతున్న తీరు .వారి జీవన పోరాటాలను చిత్రీకరిస్తూ రాసిన కథలు ఎంపిక చేసి ఈ సంకలనంలో పొందుపరిచి దీన్ని అమూల్య గ్రంథంగా తీర్చిదిద్దారు. దళితులు వాటి ఆశ్రిత జాతులు, సంచార కులాలు, బీసి ఆశ్రిత కులాలపై వచ్చిన కథలు ఇందులో వాస్తవిక వర్ణనలో చోటు చేసుకోవడం ఓ ప్రత్యేకం. ఇప్పటివరకూ చేతివృత్తులమీద వచ్చిన వాటిల్లో ఇది ఏకైక సమగ్ర సంకలనంగా చెప్పొచ్చు. వందకు పైగా ఉన్న ఈ కథల్లో ఇంచుమించు అన్ని వృత్తులను రచయితలు స్పృశించారు, వారి కథల్లో సమస్యలతో పాటు కొత్త కొత్త పరిష్కారాలను చూపించారు. దీని కన్నా ముందు కొన్ని వృత్తి కథల సంకలనాలు విడివిడిగా వచ్చాయి గాని, అన్ని వృత్తులకు సంబంధించిన కథల పుస్తకం మాత్రం ఈ మల్లెసాలనే మొదటిది.

ఈ గ్రంథంలోని 139 కథల్లో 13 చేనేత కథలు, 8 చేపలు పట్టే వత్తి కథలు, నాలుగు గొర్రెల పెంపకం వారి కథలు, రెండు ఎరుకల కథలు ఉన్నాయి. ఇంకా కుమ్మరి కథలు నాలుగు, మంగలి వృత్తివి ఐదు, పాకీ పని వారివి మూడు, వడ్రంగి వారివి ఎనిమిది, చాకలి వృత్తివి ఏడు, చెప్పుల తయారీ వారి కథలు ఆరు, కుట్టుపని నాలుగు, కాటికాపరివి రెండు, దొమ్మరి ఒకటి, యక్షగానం రెండు, బొమ్మలు చేయడం, సైకిల్ రిపేర్, పూలు అల్లడం, భవన నిర్మాణం, బంజారా కుట్టుపని, సాధనాసురులు, వ్యవసాయం, పశువుల పెంపకం, సున్నం బట్టీలు, పెయింటింగ్ పని, గానుగాడించే పని, సన్నాయి వాయించే పని, బీడీలు చుట్టేలాంటి పనులు ఇంకా ఎన్నో కథలు దీంట్లో పొందుపరచబడ్డాయి. స్త్రీవాద కోణంలోంచి చాలా కథలు ఉన్నప్పటికీ రెండు కథలు మాత్రం ప్రత్యక్షంగా స్త్రీల సమస్యలను ప్రస్తావించేవే!

ఈ మొత్తం కథకులలో 88 మంది రచయితలు, 51 మంది రచయిత్రులు. లబ్ధ ప్రతిష్టుల నుంచీ వర్ధమానుల దాకా ఉన్నారు. ఇందులో కథకుల సంక్షిప్త సమాచారం, ప్రస్తావించిన కథ ఏ వృత్తికి సంబంధించిందో అనే కొన్ని వివరాలతో పొందుపరచబడి ఉన్నందువల్ల కథకుల గురించి వారి ఇతర కథల గురించి కూడా తెలుసుకునే అవకాశం ఉంది. దీంట్లోనే కథలన్నీ సమస్యలను చూపిస్తూ సందేశాత్మకమై చదువరులను తమ వైపు తిప్పుకునేలా ఉన్నాయి.

మేదరి కుటుంబానికి చెందిన 'సఫాయి' కథగానీ, కంసాలి వృత్తి నేపథ్యంలో వచ్చిన కథలు గానీ హృద్యంగా సాగాయి. అవి చదువుతుంటే ఒళ్ళు గగుర్పాటుతో కన్నీళ్లు వస్తుంటాయి.

బతుకుతెరువు కోసం బకెట్టు, చీపురు, రేకు పట్టుకుని ఇంటింటికి తిరిగి మలాన్ని ఎత్తిపోసే కుటుంబం అది. పదవ తరగతి చదువుతున్న వాళ్ళ కొడుకు తండ్రిని మలం గుంటల వ్యర్థాలను ఎత్తిపోయడానికి వీల్లేదని పంతం పట్టడం ఈ కథలో చూస్తాం. పాయిఖానా వ్యర్థాలను తోడటానికి ట్యాంకర్, వాక్యూమ్ మిషిన్ రావడం తండ్రిని ఆ పని నుండి తప్పించే ప్రత్యామ్నాయంగా ఆ పిల్లవానికి ఆనందదాయకం. కానీ తండ్రి ఉపాధి కోల్పోయి విలపిస్తూ రోడ్డున పడటమే సఫాయి కథ.

ఆదిమకాలంలో మట్టి పాత్రలను తయారు చేయడంలో, ఆ తరువాత కాలంలో వేటలో, వ్యవసాయంలో సహకరించి ముందు నడిచిన స్త్రీ.. ఆ తర్వాతి కాలంలో ఆమె ఉనికి కరువై, కనుమరుగైందని స్త్రీ జాతి చేసిన వృత్తులను మగవాడు ఆక్రమించేసి ఆమెను వంటకు, ఇంటి పనికి, పిల్లలను కనడానికి పరిమితం చేసి ఏ వృత్తి మీద స్త్రీ పేరు లేకుండా చేసిందని 'ఆకుపేషన్' కథలో రచయిత్రి ఆవేదన. 'కాలాలు మారేనా' కథలో చాకలి వృత్తికి సంబంధించిన ఓ చదువుకున్న అమ్మాయి అంతకుముందు భర్త చనిపోయినప్పుడు దగ్గరుండి చేసే వైధవ్యానికి సంబంధించిన సామాజిక దురాచారాలను సంస్కరించి వాటిని జరగకుండా నడిపించే కథ ఔరా.. నిజమే కదా అనిపించక మానదు.

నిరంతరము అనంతము, ఐరేని కుండలు, మంగుళం పెంక మొదలైన కుమ్మరి జీవితాలకు సంబంధించిన కథలూ ఉన్నాయి, ప్రపంచీకరణ తర్వాత బాగా నష్టపోయి రోడ్డున పడ్డ వృత్తి కుమ్మరి వారిదే. వారు బతుకుదెరువు కోసం ప్లంబర్లుగా మారిన వైనాలను కళ్ళకు కట్టినట్టుగా చూపించారు. ముస్లిం జీవితాల్లోని వృత్తి కథలూ వారి జీవన విధానంలో చోటు చేసుకున్న మార్పులు చివరకు మెకానిక్‌గా మారిన వారి జీవన దుర్భర స్థితులను ఆర్ద్రంగా చూపెట్టాయి.


సాంకేతిక పరిజ్ఞానమూ, యంత్రాలు పెరిగిన కారణంగా బతుకుదెరువు అదృశ్యమై వృత్తికారులు ముఖ్యంగా కార్పెంటరి వాళ్లు అడ్డ మీద దినసరి కూలీలుగా మారిన విధానం 'పెద్ద బాడిస', 'అన్నం గుడ్డ' కథల్లో చిత్రించారు. కట్టెకోత మిషన్లు వచ్చి వడ్రంగుల జీవితాల్లో పెను మార్పులు సంభవించాయి. పనులు దొరక్క వలస వెళ్లవలసి వచ్చిన వీరి దైన్యాన్ని ఈ కథలు తెలియజేస్తున్నాయి. పద్మశాలి వృత్తి కథలు, వారిని ఆశ్రయించుకొని జీవితాలను వెల్లదీసే సాధనాసురుల ఇంద్రజాల ప్రదర్శనలు, వీరి జీవితాల్లో సృష్టిస్తున్న విధ్వంసాన్ని చిత్రిక పట్టాయి. వృత్తుల విధ్వంసాన్ని చూపిన ఈ కథలన్నీ మనలను విస్మయానికి గురిచేస్తాయి.

ఈ సంకలనం ద్వారా భిన్న వృత్తులలో జీవిస్తున్న వివిధ రకాల మనుషుల ఆకాంక్షలను, ఆరాట పోరాటాలను ప్రతిబింబిస్తున్నాయి. ఇవన్నీ విశాలము, వైవిద్య భరితమూ అయి మానవ జీవితాల్లోని సంవేదనలని ఏకకాలంలో కళ్ళ ముందు ఉంచుతున్నాయి. ఆ క్రమంలోనే ప్రతి వృత్తి లోతుపాతులు, అవి ఎలా ఏర్పడ్డాయి, ఏ ప్రయోజనానికి సృష్టించబడ్డాయి? అప్పటి సమాజంలో వాటి ఆవశ్యకత, నేడవి ఏవిధంగా అంతరించిపోతున్నాయి అనే విషయాలు స్పష్టమవుతున్నాయి.

మారిన సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల దృష్ట్యా బహుజనుల కర్తవ్యం చదువు నేర్చుకుని విద్య, ఉద్యోగాల్లో ఉపాధిని వెతుక్కొని, వారి వారి సృజనలను మెరుగు పరచుకోవాలనే సందేశాన్ని అందిస్తున్నాయి. వంశపారంపర్యంగా రాకున్నా, నేడు ఉపయోగపడే ఇతరత్రా నైపుణ్యాలను నేర్చుకుని, అలవరచుకొని జీవితాన్ని తీర్చిదిద్దుకోవల్సిన ఆవశ్యకత ఈ సంకలనం తెలియజేస్తుంది. వృత్తి పనులకు సంబంధించిన ముఖచిత్రం ఈ గ్రంథానికి మరింత ఆకర్షణ. ఈ మల్లెసాల వృత్తిపనులకు సంబంధించి ఒక విజ్ఞాన సర్వస్వం. పరిశోధక విద్యార్థులకు ఉపయోగపడే సామాజిక చారిత్రక గ్రంథం. సంపాదకురాలు జ్వలిత 2016లో 104 మంది రచయితలతో ఖమ్మం కథలు వెలువరించారు. 139 కథలతో అద్భుతంగా ఈ మల్లెసాలను తేవటం సాహితీ జగత్తుకు నిజంగానే చాలా ఉపయుక్తం. రూ.1200 విలువైన ఈ పుస్తకం ప్రతులకు 99891 98943 నెంబర్లో సంపాదకులు జ్వలితను సంప్రదించవొచ్చు.

– డాక్టర్ కటుకోఝ్వల రమేష్
99490 83327

పిల్లలను అలరించే కథలు



చిన్న చిన్న పదాలతో, తేలికగా అర్థమయ్యే భావంతో, ముచ్చట గొలిపే సంభాషణలతో, మురిపించే సన్నివేశాలతో చిన్నారుల కోసం రాయడం ఒక కళ. అమ్మ జోల పాట వింటే కలిగే ఆనందం, అన్నంలో పాలు, పంచదార కలిపి తింటే కలిగే సంతృప్తిని చిన్నారులకు కలిగిస్తూ ఆనందలోకాల్లో విహరింపచేసే రచనలు చేయడం అందరికీ సాధ్యం కాదు. కథల్లో పాత్రలన్నీ జంతువులే ఉంటాయి కానీ అవి ఒకదాన్ని ఒకటి చంపుకోవు. పేరుకి అడవికి మృగరాజు కానీ క్రూరత్వం ఎరుగదు. అనేక జంతువులు మన కళ్లముందు కనబడుతూ మంచి పనులు చేస్తుంటాయి. మనుషుల్లాగానే మాట్లాడుతుంటాయి. మనలో ఒకరిగా మారిపోయి మనల్ని అడవికి తీసుకెళ్లి అనేక ఊసుల్ని చెబుతుంటాయి. ఇవన్నీ జరిగేది పైడిమర్రి రామకృష్ణ గారి కథల్లో మాత్రమే!

పిల్లల కోసం అనేక రకాల రచనలు చేసిన పైడిమర్రి రామకృష్ణ తాజా వెలువరించిన కథల సంపుటి 'తాంబేలు ఇగురం'. ఇందులో 30 కథలున్నాయి. కథలన్నీ చదివిన తర్వాత పిల్లలు తప్పక ఆనందం పొందగలరని చెప్పవచ్చు. ఈ కథలన్నీ ప్రముఖ పత్రికలలో ప్రచురించబడి పాఠకాదరణ పొందినవే. పుస్తకం కొని చదివే తెలంగాణేతర పాఠకులను దృష్టిలో పెట్టుకొని తాబేలుని తెలంగాణలో 'తాంబేలు' అని పిలుస్తారని, 'ఇగురం' అంటే తెలివి అని తన ముందుమాటలో రచయిత వివరించారు. కథలన్నీ దేనికదే చక్కగా చదవాలనిపించేలా ఆసక్తికరంగా మలిచారు. 'ఎత్తుకెదిగిన కోతి' కథలో తన మిత్రుడైన ఏనుగుకి జంతువులన్నీ గౌరవం ఇవ్వడానికి కారణం అది చాలా బలంగా, ఎత్తుగా ఉండడం వల్లనే అనుకుంటుంది కోతి. ఆ ఏనుగు అందరికీ సహాయపడుతూ మంచి పేరు పొందిన విధానం చూసిన తర్వాత తన అభిప్రాయం మార్చుకుంటుంది. గౌరవం అనేది ఎత్తుని బట్టి కాదు, ఆకారాన్ని బట్టి అసలే కాదని, చేసే మంచి పనులు, చూపే ప్రతిభను బట్టి అని తెలుసుకుంటుంది . చిన్నారులు కూడా మంచి పనులు చేస్తూ మంచి పేరు పొందాలనే విషయాన్ని తెలుపుతుంది ఈ కథ.

'తాంబేలు ఇగురం' కథలో ఒక కప్ప తన దోస్తుల మధ్య పోటీలు పెట్టి, పందెం కాయించేది. ఓడిపోయిన వాళ్లను తిట్టుకుంటూ సంబరపడేది. చెరువు నుండి వెళ్ల గొట్టేది. ఒకసారి ఓడిపోయిన తాబేలుని కూడా చెరువు నుండి బయటకు తరిమింది. కప్పకు అదొక చెడ్డ అలవాటని, అది మాత్రం పోటీలలో పాల్గొకుండా మిగతా వాటి మీద పందాలు కాయించి తమాషా చూస్తుందని ఒక కొంగ ద్వారా తెలుసుకున్న తాబేలు తెలివిగా ఆలోచిస్తుంది. తరువాత జరిగే పోటీల్లో కప్పను పాల్గొనేలా చేసి అందులో దాన్ని ఓడిస్తుంది. కప్పని చెరువు వదిలి పొమ్మని మిగతా జంతువులు, చేపలు చెబుతుంటే అవసరం లేదని వాటికి చెప్పడమే కాకుండా ఒప్పించింది. "పోటీలో గెలుపు, ఓటమి అనేవి సహజం. అందుకు సిగ్గు పడే పని లేదు. ఎప్పటిలాగానే కలసి ఉందాం" అనడంతో కప్పకి కనువిప్పు కలిగింది. పిల్లలకీ కథ ద్వారా గెలుపోటములు సమానంగా స్వీకరించాలనే ఆలోచన కలుగుతుంది.

మైసూర్ పాక్‌లో మైసూరు ఉండనట్టే, కొన్నింటికి పేర్లుంటాయి కానీ అక్కడేమీ ఉండదు. "బుజ్జి కోతి సందేహం" కథలో ప్రదేశాల పేర్లయిన 'తాబేలు చెరువు', 'పాము పుట్ట', 'పులి గుట్ట'లకి వెళ్ళినప్పుడు ఆయా పేర్లు గల జీవుల కోసం వెతుకుతుంది బుజ్జి కోతి. దాని తల్లి కోతి "మనం చేసే మంచి పనుల వల్ల కేవలం మనకే కాదు, మన కుటుంబానికి, మనం ఉండే ప్రాంతానికి కూడా మంచి పేరు వస్తుంది. అందుకే మంచి పనులు చేయాలి. అల్లరి పనులు చేస్తే అవి చెడ్డ పేరుని తెస్తాయి" అని చెప్పడంతో అంతవరకు అల్లరిదైన బుజ్జి కోతిలో మార్పు వచ్చింది. విద్యార్థినీ విద్యార్థులు కూడా తోచిన మంచి పనులు చేస్తూ మంచి పేరుని గడించాలని , మంచిగా గుర్తుండి పోయే పనులు చేయాలని బోధిస్తుంది ఈ కథ.

'మతిమరుపు తాబేలు' కథలో తనకి పుట్టిన గుడ్లను ఎక్కడో ఒడ్డుమీద ఇసుకలో తాబేలు దాస్తుందని తెలుసుకుంటాం. అలా దాచిన గుడ్లు పిల్లలయ్యాయో లేదోనని తెలుసుకోవడానికి బయలుదేరిన తాబేలుని అనుసరిస్తూ కోతి, నక్క, కుందేలు వెళతాయి. అలా గుడ్లను ఎక్కడో దాచిన తాబేలుని అవి ఎగతాళి చేస్తాయి. తాబేలు గుడ్లు పిల్లలయ్యాయని తెలిసాక వాటితో "గుడ్లు మేము పొదిగేందుకు అవసరమైన వెచ్చదనం, రక్షణ కోసం వాటిని ఇసుక లోపల దాచి పెడతాం. ఇక అవి పక్వ దశకు రావడం మాకు మానసికంగా తెలుస్తుంది. అప్పుడే అవి పిల్లలై బయటకు వస్తాయి" అని తాబేలు చెప్పగానే మూడున్నూ తమ అవివేకానికి బాధ పడ్డాయి. విషయం తెలియకుండా అపార్థం చేసుకుని అవతలి వారిని అవమానించకూడదని ఈ కథ చెబుతుంది.

మిగతా కథలు కూడా చదివే బాల పాఠకులు తప్పక ప్రయోజనాన్ని పొందుతారు. బాలలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, మానసిక వికాసాన్ని కలిగించేదే బాలసాహిత్యం అయితే ఆ ప్రయోజనాన్ని ఈ పుస్తకం కలిగిస్తుందని చెప్పవచ్చు. ఈ పుస్తకానికి తుంబలి శివాజీ అందమైన ముఖచిత్రం గీయగా, లోపలి పేజీలలో చక్కటి చిత్రాలను శ్రీనివాస్ అందించారు. పుస్తకం పేజీలు 104. పుస్తకం ధర రూ.200. పుస్తకం కావలసినవారు రచయితని ఫోను నెంబరులో 9247564699 సంప్రదించవచ్చు.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు
94907 99203

సాంస్కృతిక పునర్వికాస ఉద్యమం అవసరం

ఇటీవల జబల్పూర్‌లో జరిగిన 18వ జాతీయ అభ్యుదయ రచయితల సంఘం మహాసభల్లో పెనుగొండ లక్ష్మీనారాయణ అరసం జాతీయ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా... చిరు ముఖాముఖి.



అరసం జాతీయ అధ్యక్షునిగా ఎంపికవడం పట్ల మీ అనుభూతి?

అభ్యుదయ రచయితల సంఘం (అరసం)తో నా ప్రయాణం 1973 ఆగస్టు 10 నుంచి 12వ తేదీల వరకూ గుంటూరులో జరిగిన ఆరవ రాష్ట్ర మహాసభల నుంచీ సాగుతోంది. అప్పుడు నా వయసు 19 ఏళ్లు. ఇప్పుడు 69 సంవత్సరాలు. ఈ ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో గుంటూరు జిల్లా కార్యదర్శి బాధ్యతల నుంచి ఉమ్మడి ఆం.ప్ర. ప్రధాన కార్యదర్శి, అధ్యక్ష బాధ్యతలతో సహా జాతీయ కార్యదర్శి పాత్రను కూడా నిర్వహించాను. ఇప్పుడు అరసం జాతీయ అధ్యక్షునిగా 2023 ఆగస్టు 20 – 22 తేదీల్లో జబల్పూర్‌లో జరిగిన 18వ జాతీయ మహాసభల్లో బాధ్యతలు చేపట్టాను. 1936 ఏప్రిల్ 9–10 తేదీల్లో అరసం ఆవిర్భవించిన తర్వాత ఒక తెలుగు సాహితీవేత్త అధ్యక్ష పదవికి ఎంపిక కావడం ఇదే తొలిసారి. అందుకు చాలా సంతోషిస్తున్నాను. ప్రేమ్‌చంద్, సజ్జాద్ జహీర్, డా.అబ్దుల్ అలీం, శ్రీపాద అమృత డాంగే, డా.విఖాస్ శర్మ, కిషన్ చందర్, విష్ణుదేవ్, భీష్మ సహానీ, గులాం రబ్బానీ, రాజీవ్ సక్సేనా, డా.ఓ.ఎన్.వి కురూప్, డా.ఖగేంద్ర ఠాకూర్, డా.కమలాప్రసాద్, డా.నాంవర్ సింగ్, డా.పొన్నీలన్ వంటి సుప్రసిద్ధ భారతీయ రచయితల నాయకత్వంలో నడచిన అరసంలో నేను అధ్యక్ష బాధ్యతలను స్వీకరించడం ద్వారా ఒక గొప్ప వారసత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని గర్వంగా భావిస్తున్నాను.

అరసం తన ఎనభై యేళ్ళ ప్రస్థానం గురించి ...

అరసానికి జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో విశిష్టమైన నేపథ్యం ఉంది. తెలుగు నేలను ఆధునిక దృష్టితో అభ్యుదయ పథంలో నడపిన వైతాళికులను స్ఫూర్తిగా తీసుకుంది. మార్క్సిజం సైద్ధాంతిక దృక్పథం అరసానిది. అందుచేతనే అరసానికి విలువైన గతం, బలమైన వర్తమానం, ఆశావహమైన భవితవ్యం ఉన్నాయి.

అరసం ఏ రాజకీయ పక్షానికి అనుబంధ సంస్థ కాదనే తీర్మానానికి ఇప్పటికీ కట్టుబడి ఉందా?

అరసం ఏ రాజకీయ పక్షానికి అనుబంధ సంస్థ కాదు. అయితే అరసం భావజాలాన్ని గుర్తించి గౌరవించే వామపక్ష, ప్రజాస్వామిక రాజకీయ పక్షాలు, సంస్థలు అందించే తోడ్పాటును స్వీకరిస్తుంది. కలిసి పనిచేస్తుంది.

అరసంలో ఎక్కువ యువకవులను తయారు చేసే దిశగా ఏదైనా కార్యాచరణ ఉందా?

అరసం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో యువకుల కోసం సాహిత్య పాఠశాలలను నిర్వహిస్తూనే ఉంది. 1946 మే 1 నుంచీ జూన్ 10 వరకూ ప్రఖ్యాత చరిత్రకారులు, సాహితీవేత్త అయిన మల్లంపల్లి సోమశేఖర శర్మ ప్రధానాచార్యుడిగా గుంటూరు జిల్లా పెదపూడి గ్రామంలో నిర్వహించిన చారిత్రాత్మక ఆంధ్ర సాహిత్య పాఠశాల నుంచి నేటివరకూ అరసం ప్రణాళికాబద్ధంగా నిర్దుష్ట కార్యాచరణతో వివిధ ప్రక్రియలను, సాహిత్య పాఠశాలలను నిర్వహిస్తూనే ఉంది.

అరసం తరపున ప్రచురణల విషయంలో మీ ప్రణాళిక?

అరసం ఆవిర్భావం నుంచి తెలుగునాట 'తెలుగు తల్లి', 'అభ్యుదయ' పత్రికలతో పాటు వేలాది పుస్తకాలను ప్రచురించింది. ఇటీవల 'ఈ తరంకోసం' శీర్షికన కథాస్రవంతి పేరుతో 51 సంపుటాలను ప్రచురించింది. ఇంకా ఈ కథా సంపుటాల ప్రచురణ కొనసాగుతూనే ఉంది. ఇంకా వివిధ ప్రక్రియలతో పుస్తకాలను వెలువరించాల్సి ఉంది. ఇవన్నీ ప్రధానంగా యువతరం కోసం ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తున్న ప్రచురణలు.

మీ అధ్యక్షతన అరసం భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉండబోతుంది?

అరసం జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలకు, ప్రాంతాలకు, భాషలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సుదీర్ఘ చరిత్ర ఉన్న సాహిత్య సంస్థ. తరువాత ఏర్పడిన అనేక సాహిత్య సంస్థల మూలాలు అరసంలో ఉన్నాయి. జాతీయ స్థాయిలో సమర్థవంతమైన నాయక బృందం ఉంది. నాకున్న అనుభవంతో అందరినీ సమన్వయం చేస్తూ, భావజాలపరంగా సన్నిహిత సంస్థలతో కలిసి సమైక్య కార్యాచరణ చేపట్టడానికి కృషి చేస్తాను. నేడున్న సంక్లిష్ట, సంక్షోభ పరిస్థితుల్లో సాంస్కృతిక పునర్వికాస ఉద్యమం అవసరమనే భావనను ముందు తీసుకుని వెళ్ళాలన్న ఆలోచన అరసానికున్నది. ఈ దిశగా కూడా కృషి కొనసాగిస్తాను. ః

సంభాషణ : టేకుమళ్ల వెంకటప్పయ్య

దొండపాటి కృష్ణకు వేదగిరి కథానికా పురస్కారం

డా. వేదగిరి రాంబాబు కథానికా పురస్కారం 2023 సంవత్సరానికి గాను దొండపాటి కృష్ణ కథా సంపుటి 'రాతి గుండెలో నీళ్లు' ఎన్నికైంది. డాక్టర్ వేదగిరి రాంబాబు జన్మదినమైన 14.10.23 నాడు రవీంద్ర భారతి, హైదరాబాద్ లో జరిగే ప్రత్యేక సభలో ఈ పురస్కారం అందజేయబడుతుంది.

– సింహప్రసాద్, 98490 61668

24న 'బతుకు బాణీలు' నానీల ఆవిష్కరణ

సెప్టెంబర్ 24న ఆదివారం ఉదయం గుంటూరు సర్వీస్ హెల్త్ ఆర్గనేజేషన్ సమావేశమందిరంలో నవ్యాంధ్ర రచయితల సంఘం–బాపు రమణ బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో కోట లీలాకష్ణ రచించిన 'బతుకు బాణీలు' నానీల సంపుటిని సుప్రసిద్ధ రచయిత డా.ఎం.ప్రభాకర్ ఆవిష్కరిస్తారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు ముఖ్య అతిథిగా హాజరవుతారు. సుప్రసిద్ధ కవి, రచయిత డా.రమణ యశస్వి అధ్యక్షత వహించే ఈ కార్యక్రమంలో లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం, వైహెచ్ కె.మోహన్రావు పాల్గొంటారు.

– కలిమిశ్రీ, నవ్యాంధ్ర రచయితల సంఘం

బిజెపిని గద్దెదించండి

- సిపిఎం పొలిట్‌బ్యూరో పిలుపు • ఇండియా ఫోరమ్ బలోపేతం, విస్తరణకు నిర్ణయం

న్యూఢిల్లీ : భారత రిపబ్లిక్, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకిక వ్యవస్థలు, ప్రజల ప్రాథమిక హక్కులు, పౌరహక్కుల పరిరక్షణ కోసం బిజెపిని గద్దె దించాలని సిపిఎం పొలిట్ బ్యూరో పిలుపునిచ్చింది. శని, ఆది వారాల్లో న్యూఢిల్లీలో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశం కేంద్రంతో పాటు, వివిధ రాష్ట్రాల్లో కూడా బిజెపిని గద్దెనుండి దించడం ద్వారానే వ్యవస్థల పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపింది. దీనికోసం ప్రతిపక్షాలు ఏర్పాటు చేసుకున్న ఇండియా ఫోరమ్‌ను బలోపేతం చేయడంతో పాటు, మరింత విస్తరించాలని పేర్కొంది. పాట్నా, బెంగళూరు, ముంబయిల్లో జరిగిన ఇండియా ఫోరమ్ సమావేశాల్లో సిపిఎం అనుసరించిన వైఖరికి పొలిట్‌బ్యూరో ఆమోదముద్ర వేసింది. ఇండియా ఫోరమ్‌ను విస్తరించడంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలను నిర్వహించాల్సిఉందని తెలిపింది. భాగస్వామ్య పార్టీల నాయకులు చర్చించి అన్ని నిర్ణయాలు చేస్తారని, అయితే, వాటి అమలుకు ఆటంకం కలిగించేలా నిర్మాణ రూపాలు వుండరాదని పేర్కొంది.దేశవ్యాప్తంగా వరుస బహిరంగ సభలను నిర్వహించి, ప్రజలను చైతన్యవంతం చేయాలంది.

ఇసిల నియామకంపై...

'ఎన్నికల కమిషనర్ల నియామకం, సంబంధిత అంశాలకు సంబంధించిన ముసాయిదా బిల్లును మోడీ సర్కారు ఇటీవల సర్క్యులేట్ చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్‌లను.. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఎంపిక కమిటీ నియమించాలంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ బిల్లు తోసిపుచ్చింది. ఈ బిల్లును పార్లమెంటు ప్రత్యేక సెషన్‌లో ఆమోదించడం ద్వారా ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధాన మంత్రి నామినేట్ చేసే కేంద్ర క్యాబినెట్ మంత్రితో భర్తీ చేయనున్నారు. ఇది ఎన్నికల కమిషన్‌పై ప్రభుత్వ ఆధిపత్యానికి దారితీస్తుంది. ఇది అప్రజాస్వామికమైనది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించాలనే రాజ్యాంగ ఆదేశాన్ని బలహీనపరుస్తుంది" అని వివరించింది. ఈ బిల్లును రాజ్యసభలో వ్యతిరేకించి ఓడించాలని ఇండియా ఫోరమ్‌లోని అన్ని పార్టీలను కోరింది.

జి-20 పై

జి-20 సమ్మిట్ తర్వాత మోడీ తనను తాను 'గ్లోబల్ సౌత్' నాయకుడిగా చెప్పుకుంటున్నారని,అదే సమయంలో గ్లోబల్ సౌత్ దేశాలు క్యూబాలోని హవానాలో నిర్వహించిన సమ్మిట్‌కు హాజరు అవుతానని ప్రకటించిన భారత విదేశాంగ మంత్రి గైర్హాజరయ్యారని పేర్కొంది. ఈ చర్య ద్వారా భారత్ అమెరికాకు మరింత విధేయ భాగస్వామి అయిందని తెలిపింది. గ్లోబల్ సౌత్ దేశాల సమావేశాలకు కనీసం మంత్రిని కూడా పంపలేని ప్రభుత్వాధినేత గ్లోబల్ సౌత్ నాయకుడు ఎలా అవుతాడని పొలిట్‌బ్యూరో ప్రశ్నించింది.

జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిపై

జమ్మూకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో ఇటీవల ఉగ్రవాద దాడిలో మరణించిన కల్నల్ మన్‌ప్రీత్‌సింగ్, మేజర్ అశిష్ దోన్‌చాక్, డివైఎస్‌పి హుమాయున్ ముజుమల్ భట్‌కు పొలిట్‌బ్యూరో శ్రద్ధాంజలి ఘటించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. కాశ్మీర్‌లో శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొన్నాయన్న మోడీ ప్రభుత్వ వాదనల్లోని డొల్లతనాన్ని ఈ దాడి బహిర్గతం చేసిందని పేర్కొంది.

ఒకే దేశం.. ఒకే ఎన్నికపై

'ఇది మన రాజ్యాంగంలో పొందుపరిచిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ఫెడరలిజంపై బహుముఖ దాడిని చేస్తుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వాన ఎనిమిది మంది సభ్యులతో ఒక కమిటీని మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. లోక్‌సభతో పాటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు ఎలా నిర్వహించాలన్న విషయమై ఈ కమిటీ సిఫార్సు చేస్తుంది. దీనికోసం రాజ్యాంగానికి అనేక ముఖ్యమైన సవరణలు చేయాల్సి వస్తుంది. దాంతో పాటు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాల పదవీకాలం గణనీయంగా తగ్గిపోతుంది. భవిష్యత్తులో ఏదైనా రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వం మెజార్టీని కోల్పోయినప్పుడు లోక్‌సభతో కలిసిఎన్నికలు నిర్వహించడానికి ఆ ప్రభుత్వ పదవీ కాలాన్ని పొడిగించాల్సి వస్తుంది. ఇది చట్ట విరుద్ధం. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం కల్పించకుండా కేంద్ర పాలన విధిస్తే అది ప్రజాస్వామ్య వ్యతిరేకమవుతుంది. అందువల్ల ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది,

త్రిపురలో ప్రజాస్వామ్యం ఖూనీ

త్రిపురలో ప్రజాస్వామ్యం హత్యకు గురైందని పొలిట్‌బ్యూరో ఆందోళనను వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 5న రెండు త్రిపుర అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార బిజెపి పూర్తిస్థాయిలో రిగ్గింగ్ చేసిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థలో ప్రత్యక్ష పర్యవేక్షణలో అసాధారణ స్థాయిలో భయాత్పాతాలను సృష్టించారని పేర్కొంది. ఈ ఎన్నికలను రద్దు చేసి, పటిష్ట చర్యల మధ్య తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసింది.

అదాని అవినీతిపై ..

అదానీ గ్రూప్ తన కంపెనీల స్టాక్ ధరలను తారుమారు చేయడంపై తాజా సాక్ష్యాలు వెల్లడైన నేపథ్యంలో దీనిపై లోతైన విచారణ జరపాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యాన్ని కోరింది.

వార్తపత్రికల్లో వచ్చిన కథనాలు వినోద్ అదానీకి చెందిన ఇద్దరు సన్నిహితులు బెర్ముడాలో పెట్టుబడి నిధిని ఎలా సమీకరించారని ప్రశ్నించింది. అదానీ కంపెనీల్లో మిలియన్ డాలర్ల షేర్లను కొనుగోలు చేయడానికి షెల్ కంపెనీలను ఎలా ఏర్పాటు చేశారో వివిధ పత్రికలువెల్లడించాయనీ పేర్కొంది. ఈ వ్యవహారంపై 2014 వరకు అనేక వివరాలు సేకరించిన సెబి మోడీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత విచారణను పక్కనపెట్టినట్లు వచ్చిన కథనాలను ప్రస్తావించింది.

నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏడుసార్లు
- చివరగా 2017లో మోడీ సర్కారు హయాంలోనే

న్యూఢిల్లీ : నేటి నుంచి పార్లమెంటు ఐదు రోజుల ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రత్యేక సమావేశాలపై ఆగస్టు 31న చేసిన ప్రకటన అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఇంత హఠాత్తుగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఎందుకు? మోడీ సర్కారు ఏవైనా కీలక బిల్లులను ప్రవేశపెట్టనున్నదా? ఎలాంటి చర్చకు తావివ్వకుండా తాను అనుకున్న బిల్లులను చట్టాలుగా తీసుకురావాలనుకుంటున్నదా? ఈ ఏడాది ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది భారత్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పుడు ఈ ఐదు రోజుల ప్రత్యేక సమావేశాలు కీలకం కానున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఐదు రోజుల పాటు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఏం జరుగుతుందనే ఊహాగానాలు, గందరగోళం మధ్య కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ప్రధాని మోడీకి ఇప్పటికే లేఖ రాసిన విషయం తెలిసిందే. ప్రత్యేక సమావేశాలకు ఎలాంటి ఎజెండానూ జాబితా చేయలేదని లేఖలో ఆమె ఎత్తి చూపారు. సాధారణంగా పార్లమెంటరీ సమావేశాల ప్రారంభానికి కొన్ని రోజుల ముందు అజెండాను ప్రతిపాదించడానికి, చర్చ అంశాలపై ఒక ఒప్పందానికి రావడానికి ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించేది. ఎక్కువగా, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాల విషయంలో ప్రత్యేక సెషన్లు నిర్వహించారు.

పార్లమెంటు ప్రత్యేక సెషన్ అంటే ఏమిటి

పార్లమెంటు సమావేశాలను నిర్వహించే అధికారాన్ని రాజ్యాంగం ప్రభుత్వానికి ఇచ్చింది. పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సెషన్‌ను పిలవాలనే నిర్ణయాన్ని తీసుకుంటుంది. పార్లమెంటు సభ్యులను (ఎంపీలను) రాష్ట్రపతి పేరుతో పిలిపిస్తారు. భారత రాజ్యాంగం పార్లమెంట్ యొక్క "ప్రత్యేక సెషన్" అనే పదాన్ని ప్రస్తావించలేదన్నది గుర్తించాల్సిన అంశం. ఆర్టికల్ 85(1)లోని నిబంధనల ప్రకారం ప్రభుత్వం ప్రత్యేక సెషన్‌గా పిలవబడేది కూడా అన్ని సెషన్‌ల కింద నిర్వహించబడుతుంది.

పార్లమెంటులో స్థిరమైన క్యాలెండర్ లేదు

భారత పార్లమెంటుకు ఇప్పటికీ నిర్ణీత సెషన్ షెడ్యూల్ లేదు. ఫిబ్రవరి 1 నుంచి మే 7 వరకు బడ్జెట్ సమావేశాలు, జులై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు వర్షాకాల సమావేశాలు, నవంబర్ 5 నుంచి డిసెంబర్ 22 వరకు శీతాకాల సమావేశాలు నిర్వహించాలని 1955లో లోక్‌సభ కమిటీ ప్రతిపాదించింది. ఈ క్యాలెండర్ ఎప్పుడూ ఉపయోగించబడలేదు.

ప్రత్యేక సమావేశాలు ఎందుకు?

"ప్రత్యేక సెషన్" అనే పదబంధం రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఉపయోగించబడలేదు. ఇది సాధారణంగా ముఖ్యమైన శాసన లేదా జాతీయ సంఘటనలను స్మరించుకోవడానికి పరిపాలన ద్వారా పిలువబడే సెషన్‌లతో ముడిపడి ఉంటుంది. ఇప్పటి వరకు ఏడు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరిగాయి.

ఏడు ప్రత్యేక సమావేశాలు ఇలా..

ఏడింటిలో, మూడు జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంఘటనలు, రెండు తమిళనాడు, నాగాలాండ్ (1977), హర్యానా (1991)లో రాష్ట్రపతి పాలనపై ఉన్నాయి. మిగిలిన రెండింటిలో, 2008లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు విశ్వాస పరీక్షను నిర్వహించడానికి ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చివరగా 2017లో మోడీ సర్కారు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది.

ప్రధాని మోడీకి ప్రముఖుల జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: భారత ప్రధాని మోడీ 73వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర మంత్రులు, బిజెపి నేతలు సహా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని జన్మదినం సందర్భంగా ఆదివారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు సేవా పక్షోత్సవాలను బిజెపి నిర్వహిస్తోంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోడీకి శుభాకాంక్షలు చెబుతూ ట్వీట్ చేశారు.

ప్రముఖ రచయిత్రి గీతా మెహతా మృతి

న్యూఢిల్లీ: ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోదరి, ప్రముఖ రచయిత్రి గీతా మెహతా శనివారం కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా వచ్చిన ఆరోగ్య సమస్యలతో ఆమె ఢిల్లీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆమె వయస్సు 80 సంవత్సరాలు. ఆమెకు ఓ కుమారుడు ఉన్నారు. ఆమె భర్త, ప్రముఖ పబ్లిషర్ సోని మెహతా 2019లోనే మరణించారు. ప్రముఖ రచయిత్రి, లఘుచిత్ర నిర్మాత, జర్నలిస్టుగా గీతా మెహతా సుపరిచితురాలు. ఆమె తండ్రి బిజూ పట్నాయక్ ఒడిశా ముఖ్యమంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. ఆమె ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు, ప్రేమ్ పట్నాయక్‌కు సొంత అక్క. 'కర్మా కోలా', 'స్నేక్ అండ్ ల్యాడర్స్', 'ఏ రివర్ సూత్ర', 'రాజ్', 'ది ఎటర్నల్ గణేష్' పుస్తకాలను ఆమె రచించారు.

మణిపూర్ మహిళా కార్యకర్తలపై అమిత్‌షా వ్యాఖ్యలు తగవు

- ఖండించిన ఒక్రమ్ ఇబోబి

ఇంఫాల్ : మణిపూర్ మహిళా కార్యకర్తలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ఒక్రమ్ ఇబోబి ఆదివారం ఖండించారు. మాదకద్రవ్యాలు, ఇతర సామాజిక దురాచారలపై పోరాడటం, నిషేధాన్ని అమలు చేయడంలో మహిళల పాత్ర గురించి అమిత్‌షా, ఇతర బిజెపి నేతలకు తెలియదని ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టమైందని అన్నారు. ప్రస్తుత అశాంతి సమయంలోనూ శాంతి భద్రతలను పరిరక్షించడంలో మహిళలు ముందంజలో ఉన్నారని చెప్పారు. మహిళల సహాయం లేకుండా మత ఘర్షణలను పరిష్కరించలేమని స్పష్టం చేశారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలంటూ పలువురు మహిళా కార్యకర్తలు ఢిల్లీలో నెలల తరబడి ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులను కలిసేందుకు యత్నించారు.

మణిపూర్‌లో మహిళా కార్యకర్తలను అదుపులో పెడితే.. రాష్ట్రంలో నెలకొన్న అశాంతిని పది రోజుల్లో పరిష్కరించగలమని అమిత్‌షా బిజెపి నేతలతో పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మహిళా కార్యకర్తలు భద్రతా బలగాల విధులకు ఆటంకం కలిగిస్తున్నారని షా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రజలతో పాటు పలువురు నేతల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. అవినీతి, ఇతర అన్యాయాలకు వ్యతిరేకంగా మణిపూర్ మహిళా కార్యకర్తల పోరాటం గురించి బిజెపి నేతలకు ఏమీ తెలీదని పలువురు రాష్ట్ర నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒడిశాను వణికిస్తున్న స్క్రబ్ టైఫస్..

భువనేశ్వర్ : ఒడిశా రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా సుందర్‌గఢ్ జిల్లాలో 11 పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. కేసుల సంఖ్య 180కి చేరిందని ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న 59 మంది శాంపిళ్లను పరీక్షించగా అందులో 11 మందికి వ్యాధి నిర్ధారణ అయిందని వెల్లడించారు. మొత్తం 180 కేసుల్లో 10 మంది బాధితులు ఒడిశా రాష్ట్రేతరులు కాగా.. 9 మంది ఇతర జిల్లాల నుంచి ఉన్నారని సుందర్‌గఢ్ జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్ కన్హు చరణ్ నాయక్ తెలిపారు.

మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై దారుణ దాడి

- యుపిలో రైలులో ఘాతుకం
- రెండు వారాలైనా దొరకని నిందితుల ఆచూకీ

లక్నో : బిజెపి ప్రభుత్వ పాలనలోని ఉత్తరప్రదేశ్‌లో మహిళల భద్రత అత్యంత ప్రశ్నార్థకంగా మారింది. ఒక మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై రైలులో దారుణంగా దాడికి పాల్పడిన ఘటన జరిగి రెండు వారాలైనా నిందితులను గుర్తించకోలేకపోవడంతో రాష్ట్రంలో, రైల్వేల్లో మహిళల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. యుపి పోలీసులు, రైల్వే పోలీసులు, యుపి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నా ఎలాంటి పురోగతి లేదు. ఈ దాడి నుంచి బాధితురాలు ప్రాణాలతో బయటపడినా జ్ఞాపక శక్తి కోల్పోయి, ఎవరినీ గుర్తుపట్టలేని స్థితిలో ఉందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బాధితురాలు చికిత్స పొందుతున్న హాస్పిటల్ వద్ద పోలీసు అధికారులు

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్ జిల్లాలోని ఒక పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న 47 ఏళ్ల రోష్ని (గోప్యత కోసం పేరు మార్చారు) అయోధ్యలోని హనుమాన్ గాడి సావన్ మేళాలో డ్యూటీ వేయడంతో ఆగస్టు 30న సరయూ ఎక్స్‌ప్రెస్‌లో అక్కడకి బయలుదేరారు. ఆమె అయోధ్య రైల్వే స్టేషన్‌లో దిగకుండా.. సరయూ ఎక్స్‌ప్రెస్ చివరి స్టాప్ మాన్కాపూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి మళ్లీ అయోధ్య వైపు బయలుదేరారు. ఈ క్రమంలోనే అంటే మాన్కాపూర్ - అయోధ్య స్టేషన్ల మధ్య ఆమెపై గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో దారుణంగా దాడి చేశారు. ముఖం, ఇతర శరీర భాగాలపై దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడి రక్తం ఓడుతూ కోచ్‌లోని బెర్త్ కింద అపస్మారక స్థితిలో పడిపోయారు. ఆగస్టు 30, 31 తేదీల మధ్య రాత్రి ఈ దారుణం జరిగింది. ఆమె సోదరుడి ఫిర్యాదుతో అయోధ్యలోని గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్, కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హత్యాయత్నం, దాడి చేయడం, ఆమె దుస్తులు ధరించాలనే ఉద్దేశం వంటి అభియోగాల కింద గుర్తు తెలియని వ్యక్తులపై ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

సుమోటోగా స్వీకరించిన లక్నో హైకోర్టు

లక్నో హైకోర్టు ఈ కేసును ఈ నెల 3న సుమోటోగా స్వీకరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేయాలని కోర్టు తన రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ కేసును విచారించడానికి ప్రధాన న్యాయమూర్తి దివాకర్ ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ నెల 4న రాష్ట్ర డిజిపి విజయ్‌కుమార్, ప్రత్యేక డిజి (శాంతి భద్రతలు) ప్రశాంత్ కుమార్ ఈ కేసును త్వరలోనే చేధిస్తామని, అసలు నిందితులను పట్టుకుంటామని ప్రకటించారు. లక్నోలోని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్శిటీలోని ట్రామా సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. అప్పటి నుంచి విచారణ ముందుకు సాగలేదు. అనుమానితుల్ని పట్టుకుంటున్నా.. ఎవరనీ నిందితులుగా ప్రకటించలేదు. ఈ నెల 16న అంటే శనివారం నిందితుల ఆచూకీ, లేదా సమాచారం చెబితే లక్ష రూపాయల నగదు బహుమతి ఇస్తామని యుపి పోలీసులు ప్రకటించారు. తలకు గాయమైన కారణంగా బాధితురాలు దాడి వివరాలను స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ఇప్పటి వరకూ బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఇంకా నమోదు చేయలేదు.

బాధితురాలి స్వస్థలం ప్రయాగ్‌రాజ్ జిల్లా. ఆమెకు ఎవరితోనూ శత్రుత్వం లేదని, తెలిసినవారు ఎవరైనా ఆమె దినచర్యను ట్రాక్‌చేసి ఈ దాడికి పాల్పడి ఉంటారని బాధితురాలి సోదరుడు తెలిపారు. స్పృహలోకి వచ్చిన దగ్గర నుంచి తమ ముఖాలను గుర్తు పడుతున్నా, తమ పేర్లను కూడా చెప్పలేకపోతుందని సోదరుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆయుధ సహకారం బలోపేతం

రష్యాతో ముగిసిన కిమ్ చర్చలు

మాస్కో : రష్యా, ఉత్తర కొరియా మధ్య ఆయుధ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు అంగీకరించాయి. రష్యాలో ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ జోంగ్ ఉన్ పర్యటన శనివారంతో ముగిసినట్లు ఉత్తర కొరియా ప్రభుత్వ వార్తా సంస్థ కెసిఎన్ఎ ఆదివారం వెల్లడించింది. పర్యటనలో చివరి రోజున ప్రిమోర్స్కీ రీజియన్ గవర్నర్ ఒలేగ్ కోజెమ్యాకో కిమ్‌కు మధ్య ఐదు కమికేజ్ డ్రోన్లు, ఒక గెరాన్-25 నిఘా డ్రోన్‌ను అందించే అంశంపై అంగీకారం కుదిరినట్లు తెలిపింది. రష్యా సైనిక అవసరాల కోసం ప్రిమోర్స్కీ రీజియన్‌లో ఉత్పత్తి అవుతున్న పరికరాలను పరిశీలించడం కోసం ఈస్ట్ స్ట్రీట్ ఎగ్జిబిషన్‌ను కిమ్ సందర్శించిన సమయంలో గవర్నర్ నుంచి ఈ ప్రతిపాదన వచ్చినట్లు తెలిపింది. అధునాతనమైన, తేలికగా ఉండే శరీర రక్షణ కవచాన్ని, రష్యాకే ప్రత్యేకమైన ఉషాంకా టోపి కిమ్‌కు అందజేశారు. రష్యాలో అతిపెద్దదైన ప్రీమోర్స్కీ అక్వేరియంను కూడా కిమ్ సందర్శించారు. ఫార్ ఈస్టర్న్ ఫెడరల్ విశ్వ విద్యాలయాని కిమ్ సందర్శించి, అక్కడ చదువుకుంటున్న ఉత్తర కొరియా విద్యార్థులతో మాట్లాడారు. రష్యా పర్యటన కోసం గత మంగళవారం మాస్కో చేరుకున్న కిమ్ రష్యా అధ్యక్షులు పుతిన్‌తోనూ చర్చలు జరిపారు.


రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగుతో కరచాలనం చేస్తున్న ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ జోంగ్ ఉన్

జాహ్నవి మృతిపై సియాటెల్‌లో ఆందోళన

- పోలీసులపై చర్య తీసుకోకపోతే ఆందోళన ఉధృతి

వాషింగ్టన్ : భారతీయ విద్యార్థి జాహ్నవి కందుల మృతిపై సియాటిల్ ప్రాంతంలోని సౌత్ ఏషియా కమ్యూనిటీ సభ్యులు ఆందోళన నిర్వహించారు. 'సీటెల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ కంటే జాహ్నవికే ఎక్కువ విలువ, జాహ్నవికి న్యాయం చేయండి, కిల్లర్ పోలీసులను జైలుకు పంపండి' అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. నగరంలో శనివారం ర్యాలీ నిర్వహించిన వందమందికిపైగా సభ్యులు డెన్నీ పార్క్ వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ్ సంస్థ ప్రతినిధులు వందనా స్లాటర్, డి.బెల్వే్ మాట్లాడుతూ పోలీసు అధికారులు ఆడరర్, డేవ్‌లపై పోలీసులు చర్య తీసుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సియాటెల్ మేయర్ క్షమాపణ

సియాటెల్ నగర మేయర్ బ్రూస్ హారెల్ క్షమాపణలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కందుల జాహ్నవి ఈ ఏడాది జనవరి 23న సీటెల్‌లో పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఢీకొని మరణించిన సంగతి తెలిసిందే. ఆమె మరణంపై సీటెల్ పోలీస్ అధికారి డానియల్ ఆర్డర్ చులకనగా మాట్లాడిన ఘటన ఈ నెల 14న వెలుగులోకి వచ్చింది. ఈ వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా జాహ్నవి మరణంపై సీటెల్ నగర మేయర్ తన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ అధికారి డానియల్ ఆర్డర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన భారత సమాజానికి క్షమాపణ చెప్పారు. నగర అధికారులు భారత కమ్యూనిటీకి, జాహ్నవి మరణానికి తమ సంతాపాన్ని తెలియజేస్తున్నామని బ్రూస్ హారెల్ తెలిపారు.సియాటెల్ పోలీస్ చీఫ్ ఆడ్రియన్ డియాజ్ కూడా జాహ్నవి మృతికి సంతాపం తెలిపారు. ఇండియన్ కమ్యూనిటీకి చెందిన 20 మంది ప్రముఖులతో సియాటెల్ మేయర్, పోలీస్ చీఫ్ శనివారం సమావేశమయ్యారు. పౌరుగువారిని రక్షించే, గౌరవించే సీటెల్ నగరాన్ని రూపొందిస్తామని వారు హామీ ఇచ్చారు. జాహ్నవి కందుల మరణంపై త్వరితగతిన న్యాయవిచారణ జరిపిస్తామని అమెరికా ప్రభుత్వం భారతదేశానికి హామీ ఇచ్చింది.

చక్కెర వివాద పరిష్కారం కోసం భారత్-బ్రెజిల్ చర్చలు ప్రారంభం

జెనీవా : పంచదారకు సంబంధించిన వాణిజ్య వివాదాన్ని పరిష్కరించుకోవడం కోసం భారత్ - బ్రెజిల్ పరస్పర చర్చలను ప్రారంభించాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఒ)లో ఈ చర్చలు ప్రారంభమయ్యాయని, ఇథనాల్ ఉత్పత్తి సాంకేతితను బ్రెజిల్ భారత్‌తో పంచుకునే అవకాశం ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. పంచదార, ఇథనాల్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే బ్రెజిల్ అగ్రస్థానంలో ఉంది. ఇథనాల్ ఉత్పత్తికి సంబంధించిన సాంకేతికత విషయంలోనూ బ్రెజిల్ ముందుంది. ఇప్పటికే కొన్ని రౌండ్ల చర్చలు జరిగాయని, ఇథనాల్ సాంకేతికతను భారత్‌తో పంచుకోవడానికి బ్రెజిల్ సిద్ధంగానే ఉందని అధికారి చెప్పారు. వాహనాలకు ఉపయోగించే పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం ద్వారా చమురు దిగుమతులను తగ్గించుకోవాలని భారత్ భావిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే లీటర్ పెట్రోల్‌లో 20 శాతం వరకూ ఇథనాల్ కలపడానికి కొన్ని వాహనాలకు కేంద్రం అనుమతించింది. 2025 నాటికి అన్ని వాహనాలకు 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను ఉపయోగించాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇథనాల్ సాంకేతికతను బ్రెజిల్ అందిస్తే, అందుకు ప్రతిగా భారత్ ఏదైనా సహాయం అందించాల్సి ఉంటుంది.

బ్రెజిల్‌లో ఘోరం

- విమాన ప్రమాదంలో 14మంది మృతి

బ్రెజిల్ : బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఉత్తర అమెజాన్‌లోని బార్సిలోస్ ప్రావిన్స్‌లో శనివారం విమానం కూలి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. పర్యాటక కేంద్రమైన బార్సెలోస్ ఉత్తర పట్టణంలోని బ్రెజిలియన్ అమెజాన్ రెయిన్ ఫారెస్ట్‌లో చిన్న విమానం కూలిపోవడంతో 14 మంది మరణించినట్లు అమెజోనాస్ రాష్ట్ర గవర్నర్ విల్సన్ లిమా ట్విట్టర్ (ఎక్స్) వేదికగా వెల్లడించారు. మృతుల్లో 12 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది ఉన్నారు. మరణించిన వారిలో అమెరికా పౌరులు ఉన్నారని స్థానిక మీడియా సంస్థలు తెలిపాయి. భారీ వర్షం కురవడంతో విమానం ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నించిందని, ఆ సమయంలోనే కూలిపోయిందని పేర్కొంది. స్పోర్ట్ ఫిషింగ్ కోసం రాష్ట్ర రాజధాని మనౌస్ నుంచి బార్సిలోస్‌కు విమానంలో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని బ్రెజిలియన్ రాష్ట్ర భద్రతా కార్యదర్శి వినిసియస్ అల్మేడా తెలిపారు.

ఇడి సమన్లపై సుప్రీంకు జార్ఖండ్ సిఎం

రాంచీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లపై జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆదివారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం ఆయన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించనుంది. తనకు జారీ చేసిన సమన్లను ఉపసంహరించుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని గతంలో ఇడిని ముఖ్యమంత్రి హెచ్చరించిన సంగతి తెలిసిందే. జార్ఖండ్‌లోని సాహెబ్‌గంజ్ జిల్లాలో అక్రమ మైనింగ్ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై హేమంత్ సోరెన్ విచారణకు హాజరుకావాలని ఇడి గత నెలలో సమన్లు జారీ చేసింది. తాను ఎటువంటి తప్పు చేయలేదని, ఒక గిరిజన నేతను కేసు పేరుతో వేధించేందుకు కేంద్రం పెద్ద కుట్ర పన్నిందని సోరెన్ మండిపడ్డారు. గతేడాది నవంబర్‌లో విచారణకు హాజరుకావాలని ఇడి సమన్లు జారీ చేయగా, ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం ఓ వేడుకలో పాల్గొనేందుకు ఆయన ఛత్తీస్‌గఢ్ వెళ్లారు.

ఆకతాయిలపై పోలీసుల కాల్పులు

- చున్నీ లాగి విద్యార్థిని మరణానికి కారణమైన నిందితులు

లక్నో : విద్యార్థిని వేధించి, చున్నీ లాగి ఆమె మరణానికి కారణమైన ఆకతాయిలు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆదివారం కాల్పులు జరిపారు. దీంతో, నిందితుల కాళ్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌లో ఈ సంఘటన జరిగింది. వారాహి గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి యువి హీరాపూర్ బజార్‌లోని ఒక కాలేజీలో ఇంటర్ చదువుతోంది. శుక్రవారం కాలేజీ ముగిసిన తర్వాత సైకిల్‌పై ఇంటికి వెళ్తోంది. కొందరు ఆకతాయిలు రెండు బైకులపై ఆమెను వెంబడించి వేధించారు. ఒక బైక్ వెనుక కూర్చొన యువకుడు యువతి చున్నీ లాగాడు. దీంతో ఆమె సైకిల్ అదుపుతప్పింది. వెనుక వస్తున్న మరో బైక్‌తోపాటు ఎదురుగా వచ్చిన బైక్ ఆమె సైకిల్‌ను ఢీకొట్టాయి. దీంతో, రోడ్డుపై పడిన ఆ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ యువతి చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. మరణించిన విద్యార్థిని తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారిని ఆదివారం వైద్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్తుండగా పోలీసుల రైఫిల్ లాక్కుని పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు కాల్పులు జరపడంతో షాబాజ్, అతని సోదరుడు అర్బాజ్, మరో నిందితుడు మహ్మద్ ఫైసల్ కాలికి గాయాలయ్యాయి. 20 ఏళ్ల వయసున్న ముగ్గురు నిందితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మణిపూర్ వీడియో పోస్ట్ చేసిన పాస్టర్ ఆత్మహత్య

భోపాల్ : మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసినందుకు క్రిమినల్ కేసు నమోదైన కేథలిక్ పాస్టర్ ఆత్మహత్య చేసుకున్నారు. సైరో మలబార్ చర్చి పాస్టర్, సాగర్ ఆర్చ్ డియోసెస్ సభ్యుడు ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ (40) మణిపూర్ అల్లర్ల సమయంలో క్రైస్తవులపై దాడులకు సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు. ఆయనపై కేసు నమోదైంది. దీంతో, ఫ్రాన్సిస్ తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని బిషప్ హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. మధ్యప్రదేశ్‌కు చెందిన అనిల్ ఈ నెల 13న బిషప్ హౌస్‌ను సందర్శించి ప్రార్థనలో పాల్గొన్నారు. ఆ తరువాత ఆయన కనిపించలేదు. పిన్నట్ కంటోన్మెంట్ ప్రాంతంలో ఈ నెల 14న చెట్టుకు వేలాడుతూ ఆయన మృతదేహం కనిపించింది. ఆయన చివరి కోరిక మేరకు దహన సంస్కారాలు నిర్వహించి, చితాభస్మాన్ని నదిలో కలిపినట్లు సాగర్ డియోసిస్ బిషప్ జేమ్స్ అతికాలం తెలిపారు.

మహిళా బిల్లు ఆమోదించాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలిస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ ఇది పార్లమెంటు సాధారణ సమావేశమని ప్రభుత్వం తమకు తెలియజేసిందని తెలిపారు. "దాని ఉద్దేశం ఏమిటో ప్రభుత్వానికి మాత్రమే తెలుసు. ఇది ఏదైనా కొత్త ఎజెండాతో అందరినీ ఆశ్చర్యపరుస్తుంది" అని ఆయన అన్నారు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, చైనాతో సరిహద్దులో పరిస్థితి వంటి అంశాలను సమావేశంలో తమ పార్టీ ప్రస్తావించిందని చెప్పారు.

అఖిలపక్ష సమావేశంలో రక్షణ శాఖ మంత్రి, లోక్‌సభ ఉపనేత రాజ్ నాథ్ సింగ్, రాజ్యసభ నేత, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూశ్ గోయల్, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, వి.మురళీధరన్, మాజీ ప్రధాని హెచ్‌డి దేవగౌడ (జెడిఎస్), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), వైకో (ఎండిఎంకె), అధిర్ రంజన్ చౌదరి, ప్రమోద్ తివారీ (కాంగ్రెస్), తిరుచ్చి శివ, కనిమొళి (డిఎంకె), డెరిక్ ఓబ్రెయిన్ (టిఎంసి), శివదాసన్ (సిపిఐ (ఎం)), బినయ్ విశ్వం (సిపిఐ), వి. విజయసాయి రెడ్డి (వైసిపి), కె. రామ్మోహన్ నాయుడు, గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్ర కుమార్ (టిడిపి), కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు (బిఆర్ఎస్), ప్రఫుల్ పటేల్ (ఎన్‌సిపి అజిత్ పవర్ వర్గం), వందన చౌహాన్ (ఎన్‌సిపి శరద్ పవర్ వర్గం), రామ్ గోపాల్ యాదవ్, ఎస్‌టి హాసన్ (ఎస్పీ), పినాకి మిశ్రా, సస్మిత్ పాత్ర (బిజెడి), మనోజ్ ఝా (ఆర్‌జెడి), లలన్ సింగ్ (జెడియు), సంజయ్ సింగ్ (ఆప్), తంబిదొరై (అన్నాడిఎంకె) పాల్గొన్నారు.

ఇదే ఎజెండా

తొలిరోజు 75 ఏళ్ల పార్లమెంట్ చరిత్రపై చర్చ జరగనుంది. మంగళవారం కొత్త పార్లమెంటు భవనానికి సమావేశాలు మారనున్నాయి. దీనికి ముందు ఎంపీల గ్రూప్ ఫోటో సెషన్ ఉంటుంది. మంగళవారం గణేశ చతుర్థి ప్రత్యేక పూజల అనంతరం కొత్త పార్లమెంట్ భవనంలో ఉదయం 11 గంటలకు సభా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఇచ్చిన అంశాల కంటే వేరే ఎజెండా లేదని అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం ప్రకటించలేదు. కొత్త పార్లమెంటుకు వెళ్లడం, వివాదాస్పద ఎన్నికల కమిషన్ బిల్లుతో సహా ఐదు బిల్లులను పరిగణనలోకి తీసుకోవడం ఎజెండాగా ఉంది. అఖిలపక్ష సమావేశంలో సర్క్యులేట్ చేసిన బిల్లుల్లో ఎన్నికల సంఘం సభ్యులను నియమించే అధికారం కేంద్రానికి పూర్తిగా కల్పించే బిల్లును చేర్చలేదు. ఈ బిల్లును పరిగణనలోకి తీసుకోవడం లేదా అని ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించగా.. పరిశీలిస్తున్నామని బదులిచ్చారు. పోస్టాఫీసు బిల్లు, న్యాయవాదుల సవరణ బిల్లు, ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు వంటి బిల్లులను కూడా ప్రత్యేక సెషన్‌లో చర్చిస్తారు.

తెలుగు వెలుగు




సాటి లేని మేటి తె(వె)లుగు
వెన్నెల్లా చల్లదనం
తెలుగు భాష చక్కదనం
నలుదిశలా చాటాలోయ్
మాతృభాష గొప్పతనం

మల్లెల్లా తెల్లదనం
తెలుగు భాష మూలధనం
'దేశభాషలందు లెస్స'
పరిమళించు పూలవనం
తెలుగు వెలుగు అసమానం
తెలుగోళ్ళకు బహుమానం

సాటి లేని మేటి భాష
లేదు కదా కొలమానం
పద పదమున తీయదనం
తెలుగు భాష ఘనం ఘనం
పరిరక్షణ చేయాలోయ్!
మనమంతా దినం దినం

– గద్వాల సోమన్న
99664 14580

అంకెలు కలపండి



పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరుసగా కలిపితే ఓ అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి మరి.

నేను గీసిన బొమ్మ



సానియా బేగం,
6వతరగతి
కొమ్మారెడ్డి హై స్కూలు
బంటుమిల్లి.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



వినాయకుడు - సనాతన వినాయకుడు

వినాయకుడు ఇంకా నిద్ర లేవటానికిముందే ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది తల్లి పార్వతి. మూషికుడు కూడా ముందుగానే సిద్ధమయ్యాడు. అనునయంగా ఒకసారి, ఆదుర్దాగా ఇంకోసారి, అత్యవసర మోడ్‌లో మరోసారి– పార్వతమ్మ పిలిచి, తట్టి, గట్టిగా ఊపితే తప్ప వినాయకుడు కళ్లు తెరవలేదు.

"ఇంకాసేపు నిద్రపోనివ్వొచ్చు కదా, మమ్మీ..." అన్నాడు ముద్దుగా.

"పోవొచ్చు పోవొచ్చు.. కానీ, ఈరోజు నీ పుట్టినరోజు. ఇప్పటికే నీ పండగ సంబరాలు మొదలై పోయాయి. తొందరగా రెడీ అవ్వు. బయటికి వెళ్లి మండపాలను సందర్శించండి. ప్రసాదాలు స్వీకరించండి." అని తొందరపెట్టింది పార్వతమ్మ.

బొజ్జ తడుముకుంటూ విసుగ్గా వీక్షించిన గణేషుడిని చూసి, కిసకిసా నవ్వుకున్నాడు మూషికుడు.

"రాత్రి ఎంత లేటుగా పడుకున్నానో నీకు తెలుసు కదా! ఎందుకంత విలాసంగా నవ్వుతున్నావు?" అని మూషికుడిని మురిపెంగా కసురుకొని, వాష్ రూమ్‌లోకి నడిచాడు వినాయకుడు.

"నిద్ర కోసమే ఇంత కోపమా దేవా ...

మున్ముందున ఇడుములెన్నో, రావా.." అని తనలో తానే అనుకోబోయి, బయటకే అనేశాడు మూషికుడు.

"ఏంటీ, ఇడుములా?" అని కంగారుగా లోపలి నుంచి అరిచాడు లంబోదరుడు.

"ఇడుములు కాదు, కుడుములు కుడుములు .." అని బదులిచ్చి, కూనిరాగం తీసుకుంటూ పార్వతమ్మకు సాయపడటానికి వంటింట్లోకి దూరాడు మూషికుడు.

స్నానపానాలు ముగించి, ఒకపరి అక్కడి నుంచి నేరుగా మండపాల వైపు తేరిపారా చూశాడు గణపతి. ఏర్పాట్లు ఘనంగా జరిగి, మండపాలు కనుల పండగగా అమర్చి, రకరకాల కొత్త కొంగొత్త రూపాల్లో అలంకరణలు జరిగి కనిపించేసరికి– మనసుకు మహోత్సాహంగా అనిపించింది. ఎలుక వాహనం వైపు ఓరకంట చూసి ఒకింత సంబరంగా నవ్వాడు.

ఎలుక వాహనం ఏదో వైపు చూస్తున్నట్టు చూసి, లోలోపల నవ్వింది.

"ఏమైంది నీకు? ఇందాకటి నుంచీ నీ వరస తేడాగానే ఉంది." అనడిగాడు.


"ఏం లేదు నాయకా.. సిద్ధం కండి. బయల్దేరదాం." అన్నాడు మిస్టర్ మూషిక్.

"సరే .. నీ ముసిముసి ముసలి నవ్వులు సరిపెట్టి, డ్రెస్ సెలెక్టు చేయడంలో సహాయపడు కాస్త. ఏ మండపంలో కొత్త మోడల్ ఉందో వెతికి పెట్టు." అని అడిగాడు వినాయకుడు.

ల్యాప్‌టాప్ తెరచి, ఇంటర్నెట్‌లో వీక్షించటం మొదలెట్టాడు మూషిక్. ఓ మండపంలో వినాయక విగ్రహానికి "తగ్గేదేలే" స్టయిల్లో గెటప్ కనిపించింది. ఓ తెలుగు సినిమా హీరో అభిమానులు ఏర్పాటు చేసిన మండపం అది.

మూషికుడు ఆ డ్రెస్ చూపించాడు. వినాయకుడికి తెగ నచ్చేసింది. వెంటనే ఆ డ్రెస్‌లోకి మారిపోయి, "తగ్గేదేల్యా" అని గడ్డం కింద నుంచి స్టయిల్‌గా చేతిని పోనిచ్చి, పోజిచ్చాడు. మూషికుడు మళ్లీ వెనక్కి తిరిగి నవ్వుకున్నాడు.

"చూడమ్మా .. ఈ ఎలక వాహకుడు ఎలా నవ్వుతున్నాడో ..." అమ్మకు ఫిర్యాదు చేయబోయేంతలో– పార్వతి అక్కడికి వచ్చింది. వస్తూ వస్తూ తన వెనక సనాతన వినాయకుడిని తోడ్కొని వచ్చింది!



సనాతన వినాయకుడు ఈ వినాయకుడికి అవటానికి అన్నయ్యే కానీ, మరీ చిన్నోడిలాగ కనిపిస్తాడు. ఒళ్లంతా పసుపు పూసుకొని, జుట్టును పిలకలాగా ముడివేసుకొని, చిన్న గావంచా మాత్రమే కట్టుకొని ఉన్నాడు. ఆశ్చర్యంగా చూస్తున్నాడు ఆధునిక గెటప్‌లో ఉన్న వినాయకుడు. తమ్ముడి వైపు తటపటాయిస్తూ వీక్షించాడు సనాతన వినాయకుడు.

"ఇద్దో గణపతీ... నీతో పాటు ఈ సనాతన అన్నను కూడా పర్యటనకు తీసుకొని వెళ్లు. నీలా లోకం పోకడ తెలిసినవాడు కాడు. కాస్త కని పెట్టుకొని ఉండు." అంటూ అప్పగింతలు మొదలు పెట్టింది అమ్మ.

పొద్దున్నుంచి ఎలకయ్య ఎందుకు నవ్వుతున్నాడో అర్థమైంది గణేషుడికి. గుర్రుగా చూశాడు. ఈసారి పకపకా నవ్వాడు మూషికుడు. ఇంకా నిండా ఆరగించలేదు కాబట్టి వినాయకుడి పొట్ట పదిలంగానే ఉంది కానీ, లేకుంటే ఆ నవ్వుకి పగిలిపోయేది.

"ఇదంతా నీకు ముందే తెలుసన్నమాట! ఇంటి దగ్గరే అనేకానేక విషయాల మీద సనాతన అన్న ఎన్నెన్ని అభ్యంతరాలు చెబుతాడో నీకు తెలుసు. ఇక అన్నను వెంట బెట్టుకొని వెళితే – సందర్శన సాగినట్టే!" అని ఉస్సూరమనిపోయాడు వినాయకుడు.

"అమ్మా .. అన్న ఎందుకమ్మా నాతో. తనను విడిగా వెళ్లమనొచ్చు కదా!" అన్నాడు.

"బుజ్జి కన్నా .. అన్న ఆ పూజా మండపాల దారులూ తీరులూ మరిచి ఎన్నో వేల ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పుడు ఒంటరిగా వెళితే కంగారు పడతాడు. నీ వెంటే క్షేమం." అంది అనునయిస్తూ.

ఈలోగా సనాతన అన్న తమ్ముడి డ్రెస్సు మీద అభ్యంతరం లేవనెత్తాడు. ఇలాంటి వస్త్రధారణ మన ఇంటా వంటా ఉందా?" అని తండ్రి పులి చర్మధారణ కథను వివరించటం మొదలు పెట్టాడు. సాంప్రదాయాన్ని మంట గలుపుతున్నాడని తమ్ముడు వినాయకుడి మీద విరుచుకుపడ్డాడు.

"ఔరా.. ఆదిలోనే హంసపాదు" అని నెత్తికొట్టుకున్నాడు మూషికుడు.

"చేసిందంతా చేసి, ఇందాక నాకు డ్రెస్సు కూడా సెలక్టు చేసి, ఇప్పుడు నాటకాలు ఆడుతున్నావు కదా?" అన్నాడు వినాయకుడు.

"అలా ఏం లేదు ప్రభూ... పొద్దున మీరు హాయిగా బజ్జొని ఉన్నప్పుడే అమ్మ ఈ అన్నయ్య సంగతి నాకు చెప్పింది. ఇంకా ముందే తెలిస్తే మీకు విన్నవించకుండా ఉంటానా? సరే.. పర్యటనకు ఆలస్యమవుతోంది. బయల్దేరదామా?" అని వినమ్రంగా అడిగాడు మూషిక్.

"నాన్నా .. డ్రెస్సు మార్చుకోరా మరి!" గోముగా అంది పార్వతమ్మ.

దబదబా కాళ్లు నేలకు తాడిస్తూ, లోపలికి వెళ్లాడు గణపతి. నారపంచె ధరించి, నీరసంగా బయటికి వచ్చాడు.

"ఎంత మంచి పిల్లాడో ..." అని మురిపెంగా చూసింది అమ్మ.

"నాన్నా .. అన్న చెప్పినట్టే విను. అన్న ఉద్దేశాలు ఏమిటో ఇప్పుడు విను. లక్షరాలా అవే పాటించు." అంది. "ఇప్పుడు నువ్వు వివరించు సనాతనా ..." అని సనాతన వినాయకుడి వైపు చూసింది.

సనాతనుడు శ్లోకాలు కొన్ని పఠించి, ఇలా వివరించటం మొదలు పెట్టాడు.. : "పసుపుతోనూ, మట్టితోనూ చేసిన బొమ్మలనే తిలకించాలి. ఆధునిక పొయ్యిల మీద తయారు చేసిన కుడుములను భుజించరాదు. నదులు, వాగుల వెంబడి ప్రవహించు నీటినే తాగాలి. ధనధనామని శబ్దములు చేయు సంబరాలను వీక్షించరాదు. కళ్ల మిరుమిట్లు గొలుపు విద్యుత్ దీపాలంకరణల దరికి ఎట్టి పరిస్థితుల్లోనూ పోరాదు. ఇతర దేశ్యముల నుంచి వచ్చి ఇచట సాగు చేసిన ఎలాంటి ఫలాలను ముట్టుకోరాదు. మైకులు మైషాసురుడు వంటివి. అందు మంత్రాలను, వ్రత కథలను చదవరాదు. చదివినా వినరాదు. పెద్ద పెద్ద లడ్డుల తయారీ, వాటి వేలం వేసే వెర్రితనమూ నిషేధించవలెను. ఆధునిక వస్త్రాలు ధరించిన భక్తులు ఉండు చోటుకు పోరాదు. మండపాలన్నీ గడ్డితోనూ, మట్టితో మాత్రమే నిర్మించి ఉండాలి. అలాంటి చోట్లనే మనం దర్శించాలి. ఇవి ఇప్పటికి కొన్ని. ఆయా సందర్భాలను బట్టి మరికొన్ని సనాతన ధర్మాలు అప్పటికప్పుడు వివరిస్తాను." అని ముగించాడు.

"ఇక నడవండి వెనక్కు. కాదు కాదు ముందుకు.." అన్నాడు మూషికుడు నవ్వుతూ.

"నడవాలా? ఓలా వాహనం బుక్ చేయలేదా?" అని నీరసంగా అన్నాడు వినాయకుడు.

"ఇంతవరకూ సనాతన అన్న గారి ఉపన్యాసం విని కూడా ఈ మాటా?" అని నసిగినట్టు నసిగి పుసుక్కున నవ్వాడు వాహకుడు.

"ఇక పర్యటన సాగినట్టే! ప్రసాదాలు తిన్నట్టే! కుడుములు దక్కవు, ఇడుములు దక్క..." అనుకుంటూ నీరసంగా నడక మొదలు పెట్టాడు ఆధునిక వినాయకుడు.

– సత్యాజీ

నటీనటులపై నిషేధం .. సృజనకు అవరోధం ...


కళా ప్రదర్శన ఏదైనా సరే, అదొక సామూహిక సృజన. నలుగురు కలిసి, సాధన చేసి, సమన్వయంతో వ్యక్తీకరిస్తేనే– అది రక్తి కడుతుంది. ప్రేక్షకులను, శ్రోతలను రంజింపచేస్తుంది. ఆధునిక కళగా అవతరించి, అలరింపజేస్తున్న సినిమా వందల, వేల వ్యక్తుల, చేతుల, ఆలోచనల సృజనాత్మక రూపం. నిర్దేశించుకున్న విభాగాలకు సంబంధించిన కళాకారులు, వృత్తి నిపుణులు ఎవరు లోటు చేసినా – సినిమా నిర్మాణం ముందుకు సాగదు.



తెర వెనక ఎంతమంది ఎన్నెన్ని అహోరాత్రులు పనిచేసినా ప్రేక్షకులకు కనువిందు చేసే పాత్రలను పోషించేది నటీనటులు. అలాంటి ముఖ్య పాత్రధారులు దర్శకుడి సమన్వయంలో ఇమడకపోతే– ఆ సినిమాకు ఏర్పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సినిమాలోని పౌడరు నుంచి పోస్టరు దాకా అయ్యే ప్రతి ఖర్చునూ భరించే నిర్మాతకు ఆర్థిక ఇబ్బందులు అలవి కాకుండా వచ్చి పడతాయి. సినిమా అనే నావను నడిపించే సారథి దర్శకుడు. అగ్రనటులైనా, ఆఫీసు బాయ్ అయినా క్షణక్షణం అతడి సూచనలకు అనుగుణంగా పనిచేస్తేనే – ఆ నావ సకాలంలో థియేటరు అనే తీరానికి చేరుతుంది.

సకాలంలో షూటింగులకు హాజరు కాకపోవడం, సహకరించకపోవడం, తోటి సభ్యులతో గొడవ పడడం వంటి కారణాలతో కొందరు నటులు అప్పుడప్పుడు వార్తలకెక్కుతుంటారు. అదొక ఒరవడిగా మారితే – దర్శక నిర్మాతలకు తీరని నష్టం కలుగుతుంది. ఇలాంటి నటీనటులను తొలుత హెచ్చరించటం, అప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోతే– నిర్మాతలు అందరూ కూడబలుక్కొని నిషేధం విధించటం అప్పుడప్పుడు చిత్ర పరిశ్రమలో జరుగుతుంది. గత వారంలో తమిళ నిర్మాతల మండలి నలుగురు హీరోలపై ఇలాంటి నిషేధం విధించింది. ఒప్పుకున్న సినిమాల నిర్మాణానికి సహకారం అందించటం లేదనేది నిర్మాతల ఫిర్యాదు. విశాల్, ధనుష్, శింబు, ఆధర్వ నిషేధానికి గురైన నటులు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కేరళలో నటులు సాన్ నిగమ్, శ్రీనాథ్ భాసిపై అక్కడి నిర్మాతల మండలి ఏడాది పాటు నిషేధం విధించింది.







రకరకాల కారణాలతో నటులపై ఇలా నిషేధం విధించటం చాలా కాలంగా వస్తోంది. 2016 నాటి ఉరి, 2019 నాటి పుల్వామా సంఘటనల్లో ఉగ్రవాదుల దాడిలో మన సైనికులు మరణించినప్పుడు – పాకిస్తాన్‌కు చెందిన నటులు, గాయకులపై బాలీవుడ్ నిర్మాతల మండలి నిషేధం విధించింది. పాక్ నటులు, సాంకేతిక నిపుణులూ భాస్వామ్యం వహించిన డియర్ జిందగీ, ఏ దిల్ హై సినిమాలను చూడరాదని కొందరు పిలుపునిచ్చినా– సగటు ప్రేక్షకులు సినిమాను సినిమాగానే చూసి, ఆదరించారు.

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ ఒక కో డైరెక్టరుతో గొడవ పడ్డాడని, షూటింగుకు సరిగ్గా హాజరు కావడం లేదని గతంలో కొద్దికాలం నిషేధం విధించారు. ఆ తరువాత ఆయన అనేక సినిమాల్లో నటించి, ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. 'అనామిక' సినిమా ప్రమోషన్లకు హాజరు కాలేదని నయనతార, 'అప్పారావు డ్రైవింగ్ స్కూలు' సినిమా షూటింగుకు సరిగ్గా సహకరించలేదని మాళవిక నిర్మాతల నిషేధానికి గురయ్యారు. వేర్వేరు కారణాలతో టాలీవుడ్‌లో నిరోషా, అంకిత, శృతిహాసన్ లపై కూడా నిర్మాతల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. కొన్నిసార్లు అనధికార నిషేధాలు అమలవుతూ ఉంటాయి. అలాంటప్పుడు నటులు ఒక చిత్రసీమ నుంచి మరొక చిత్రసీమకు మారి పాపులర్ అయిన సందర్భాలున్నాయి. ప్రియాంక చోప్రా బాలీవుడ్‌లో కొంతమంది కుట్ర కారణంగా నిర్లక్ష్యానికి గురయ్యాకే హాలీవుడ్‌కి మారినట్టు స్వయంగా ఆమె చెప్పారు.

ఒకనాటి అగ్రనటులు ఎన్టీఆర్, ఎఎన్నార్, వారికి మద్దతుగా నిలిచే నిర్మాతలూ నటి జమునను దూరంగా పెట్టారనే ప్రచారం ఉంది. ఆమె ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవం కొంతమందికి అహంభావంలా అనిపించి, ఆమెను తమ సినిమాల్లోకి తీసుకోవడం మానేశారని జమున ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఏదేమైనా సరే, సమన్వయంతోనూ, సహకారంతోనూ సాగాల్సిన సినిమా ప్రయాణంలో సర్దుబాట్లు, దిద్దుబాట్లు చాలా అవసరం. కళపైనా, కళాకారులపైనా నిషేధం ఆహ్వానించదగిన పరిణామం అయితే కాదు.



సిరాజ్ సింహనాదం

మహ్మద్ సిరాజ్ వికెట్ల సిక్సర్
50 పరుగులకే కుప్పకూలిన శ్రీలంక
ఆసియా కప్ చాంపియన్‌గా భారత్



కొలంబో : భారత్ అష్టపది. రికార్డు స్థాయిలో ఎనిమిదో సారి ఆసియా కప్ విజేతగా అవతరించింది టీమ్ ఇండియా. ఆదివారం కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంకపై 10 వికెట్ల తేడాతో అత్యంత ఏకపక్ష విజయం సాధించింది. 51 పరుగుల అతి స్వల్ప లక్ష్యాన్ని 6.1 ఓవర్లలోనే ఛేదించిన టీమ్ ఇండియా..మరో 263 బంతులు మిగిలి ఉండగానే ఎనిమిదో ఆసియా కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. యువ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (27 నాటౌట్, 19 బంతుల్లో 6 ఫోర్లు), ఇషాన్ కిషన్ (23 నాటౌట్, 18 బంతుల్లో 3 ఫోర్లు) అజేయ భాగస్వామ్యంతో శ్రీలంకపై చెలరేగారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంకపై మహ్మద్ సిరాజ్ (6/21) విరుచుకుపడ్డాడు. పది బంతుల వ్యవధిలో ఐదు వికెట్లు పడగొట్టిన సిరాజ్‌కు హార్దిక్ పాండ్య, బుమ్రా తోడటంతో శ్రీలంక 15.2 ఓవర్లలో 50 పరుగులకే కుప్పకూలింది. శ్రీలంక బ్యాటర్లలో కుశాల్ మెండిస్ (17), దుశాన్ హేమంత (13 నాటౌట్) రెండెంకల స్కోరు అందుకున్నారు. ఆరు వికెట్ల మొనగాడు మహ్మద్ సిరాజ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



ఓపెనర్లే ఊదేశారు : 51 పరుగుల అతి స్వల్ప లక్ష్యాన్ని ఓపెనర్లే ఊదేశారు. కెప్టెన్ రోహిత్ శర్మ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన ఇషాన్ కిషన్.. శుభ్‌మన్ గిల్ తోడుగా పవర్‌ప్లేలో పవర్‌ఫుల్‌గా ఆడాడు. వికెట్‌కు ఇరువైపులా గిల్, కిషన్‌లు బౌండరీలు బాదటంతో శ్రీలంక చేష్టలుడిగింది. గిల్ ఆరు బౌండరీలతో దండెత్తగా.. ఇషాన్ కిషన్ సైతం మూడు బౌండరీలతో విరుచుకుపడ్డాడు. యువ ఓపెనర్ల ధనాధన్‌తో 6.1 ఓవర్లలో టీమ్ ఇండియా లాంఛనం ముగించింది. 10 వికెట్ల తేడాతో అత్యంత ఏకపక్ష విజయం నమోదు చేసింది.

సిరాజ్ విశ్వరూపం : టాస్ నెగ్గిన శ్రీలంక తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఫైనల్లో బంతితో వేట షురూ చేసిన టీమ్ ఇండియా.. ఇన్నింగ్స్ ఆరంభ ఓవర్లోనే బ్రేక్ సాధించింది. పేస్ దళపతి బుమ్రా ఇన్నింగ్స్ మూడో బంతికే ఓపెనర్ కుశాల్ పెరీరా (0)ను సాగనంపాడు. బుమ్రా బంతి అవుట్‌సైడ్ ఎడ్జ్ కావటంతో పెరీరా వికెట్ కీపర్‌కు చిక్కాడు. బుమ్రా వికెట్ల పతనానికి దారి చూపగా.. మహ్మద్ సిరాజ్ అసలు సంగతి చూసుకున్నాడు. తన రెండో ఓవర్లోనే సిరాజ్ అసమాన ప్రదర్శన చేశాడు. ఇన్నింగ్స్ నాల్గో ఓవర్లో ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. నిశాంక (2), సమరవిక్రమ (0), చరిత్ అసలంక (0), ధనంజయ డిసిల్వ (4)లు సిరాజ్‌కు స్వింగ్‌కు దాసోహం అయిపోయారు. సిరాజ్ దెబ్బకు శ్రీలంక నాలుగు ఓవర్లలో 12 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. తన తర్వాతి ఓవర్లో శ్రీలంక కెప్టెన్ దసున్ శనక (0)ను సైతం వెనక్కి పంపిన సిరాజ్.. శ్రీలంకను నిసహాయ స్థితిలోకి నెట్టాడు. టాప్ ఆర్డర్‌లో కుశాల్ మెండిస్ (17), లోయర్ ఆర్డర్‌లో హేమంత (13 నాటౌట్) రెండెంకల స్కోరుతో శ్రీలంక 50 పరుగుల మార్క్ తాకింది. హార్దిక్ పాండ్య సైతం స్వింగ్ రాబట్టి.. శ్రీలంక లోయర్ ఆర్డర్ ఖేల్ ఖతం చేశాడు. దునిత్ వెల్లలాగే (8), ప్రమోద్ మధుశన్ (1), మతీశ పతిరణ (0)లు హార్దిక్ పాండ్య బంతికి వికెట్లు కోల్పోయారు. 92 బంతుల్లో 50 పరుగులు చేసిన శ్రీలంక.. భారత్‌తో వన్డేల్లో అత్యల్ప స్కోరుకు కుప్పకూలింది.



డైమండ్‌లో సిల్వర్!

నీరజ్ చోప్రాకు రెండో స్థానం
జాకుబ్‌కు పసిడి పతకం
డైమండ్ లీగ్ ఫైనల్స్

యూజీన్ (అమెరికా) : భారత గోల్డెన్ బాయ్, ప్రపంచ చాంపియన్, ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా డైమండ్ లీగ్‌లో సిల్వర్‌తో సరిపెట్టుకున్నాడు. యూజీన్‌లో శనివారం (భారత కాలమానం ప్రకారం అర్థ రాత్రి తర్వాత) జరిగిన ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్లో జావెలిన్ త్రో సూపర్‌స్టార్ ఇటీవల కాలంలో తొలిసారి అగ్రస్థానానికి దిగువన నిలిచాడు. మెన్స్ జావెలిన్ త్రోలో పసిడి ఫేవరేట్‌గా బరిలోకి దిగిన నీరజ్ చోప్రా.. ఈ సీజన్‌లోనే అత్యంత నిరాశజనక ప్రదర్శన చేశాడు!. 2022 డైమండ్ లీగ్ ఫైనల్లో 88.44 మీటర్ల త్రోతో కిరీటం దక్కించుకున్న నీరజ్ చోప్రా..ఈ ఏడాది రెండో స్థానంలో సరిపెట్టుకున్నాడు. 83.80 మీటర్ల దూరమే ఈటను విసిరిన నీరజ్ చోప్రా.. చెక్ రిపబ్లిక్ అథ్లెట్ జాకుబ్ వడ్లేచ్‌కు టైటిల్ కోల్పోయాడు. ఈటను 84.24 మీటర్ల దూరం విసిరిన చెక్ రిపబ్లిక్ అథ్లెట్.. బంగారు బల్లెం వీరుడు నీరజ్ చోప్రాపై తొలిసారి పైచేయి సాధించాడు.

జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ చోప్రా తొలి ప్రయత్నంలో విఫలమయ్యాడు. ఫౌల్‌తో తొలి ప్రయత్నం అవకాశం చేజార్చుకున్నాడు. రెండో ప్రయత్నంలో ఫైనల్లో తన ఉత్తమ ప్రదర్శన చేశాడు. బల్లెం 83.80 మీటర్లు విసిరాడు. ఆ తర్వాత వరుసగా 81.37 మీటర్లు, 80.74 మీటర్లు, 80.90 మీటర్లు ఈటను విసిరాడు. కానీ ఏ ప్రయత్నంలోనూ చెక్ రిపబ్లిక్ అథ్లెట్ జాకుబ్‌ను అధిగమించలేకపోయాడు. ఇదే సమయంలో మూడో స్థానంలో నిలిచిన ఫిన్లాండ్ అథ్లెట్ ఒలీవర్ హెలాండర్ సైతం నీరజ్ చోప్రాపై ఒత్తిడి పెంచాడు. 83.74 మీటర్లతో మూడో స్థానంలో నిలిచిన ఒలీవర్.. నీరజ్ చోప్రాకు కేవలం ఆరు సెంటీమీటర్ల దూరంలోనే నిలిచాడు. డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో రెండో స్థానంలో నిలిచిన నీరజ్ చోప్రా.. సెప్టెంబర్ 23 నుంచి ఆరంభం కానున్న ఆసియా క్రీడల్లో పసిడి ఫేవరేట్‌గా బరిలోకి దిగనున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68